సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



...పతకాలు పట్టారు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ మెన్ అండ్ వుమెన్ పోటీలు ఆదివారం అమలాపురంలో ఉత్కంఠ భరితంగా జరిగాయి.

II లో



విహార యాత్ర..విషాదాంతం

పుట్టిన రోజు వేడుక జరుపుకొందామని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నుంచి కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం వచ్చిన యువకుల విహార యాత్ర విషాదాంతమైంది.

డెల్టాలకు 14,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 14,700 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాలకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఆరు లేన్లుగా హైవే

- రాజమహేంద్రవరం – విశాఖ మధ్య అభివృద్ధి
- ఎంపీ భరత్ విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ



ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నం – రాజమహేంద్రవరం మధ్య 16వ నంబర్ జాతీయ రహదారి త్వరలో ఆరు లేన్లుగా అభివృద్ధి చెందనుంది. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ విషయమై గత ఆగస్టు 3న తాను చేసిన విజ్ఞప్తికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ రోడ్డు విస్తరణకు డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) ఇప్పటికే తయారైందని, సాధ్యమైనంత త్వరగా పనులు చేపడతామని కేంద్ర మంత్రి ఆదివారం తనకు లిఖితపూర్వకంగా తెలిపారని ఎంపీ వివరించారు. ఇప్పటికే అనకాపల్లి – శ్రీకాకుళం, రాజమహేంద్రవరం – విజయవాడ మధ్య జాతీయ రహదారి అభివృద్ధి పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం – అనకాపల్లి మధ్య 2000లో నాలుగు లేన్లుగా నిర్మించిన హైవేను పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా విస్తరించాల్సిన అవసరాన్ని గడ్కరీకి వివరించానని ఎంపీ మార్గాని తెలిపారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి – అన్నవరం – దివాన్ చెరువు మధ్య ఆరు లేన్లుగా హైవే అభివృద్ధికి కేంద్ర మంత్రి వెంటనే నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అన్నవరం – దివాన్ చెరువు మధ్య ప్యాసింజర్ కార్ ఈక్విలెంట్ (పీసీయూ) లక్ష్యంగా ట్రాఫిక్ పెరుగుతోందన్నారు. ఖమ్మం – దేవరపల్లి మధ్య 160 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ మరింత పెరుగుతుందనే విషయాన్ని గడ్కరీకి వివరించానన్నారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన గడ్కరీకి ఎంపీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

హౌసింగ్ పీడీగా సునీత

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీఎస్ సునీతను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి హౌసింగ్ పీడీగా కొవ్వూరు ఈఈ జి.పరశురామ్ వ్యవహరించారు. రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ)గా ఎం.వెంకట సుధాకర్‌ను నియమించారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు జిల్లా సివిల్ సప్లయిస్ విజిలెన్స్ అధికారిగా పని చేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. అలాగే ఓఎన్‌జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్)గా పని చేసిన టీఈఎం రాజును విశాఖపట్నం ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ)గా బదిలీ చేశారు.

లోవకు పోటెత్తిన భక్తులు

తుని: లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 5 వేల మంది భక్తులు ఉదయం తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మత్స విశ్వనాథరాజు తెలిపారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.34,420, పూజా టికెట్ల ద్వారా రూ.14,890, కేశఖండన టికెట్ల ద్వారా రూ.3,640, వాహన పూజ టికెట్ల ద్వారా రూ.3,450, కాటేజీల ద్వారా రూ.24,720, ఇతర డొనేషన్ల ద్వారా రూ.65,633 కలిపి రూ.1,47,752 ఆదాయం వచ్చిందని వివరించారు.

రోడ్డు ప్రమాదాలకు స్పాట్

- ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ప్రత్యేక కసరత్తు
- పోలీసు, ఆర్‌డీఓ, ఆర్అండ్‌బీ అధికారుల ఉమ్మడి కార్యాచరణ
- 31 బ్లాక్‌స్పాట్ల గుర్తింపు
- రక్షణ చర్యలకు శ్రీకారం
- ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహనకు కృషి
- విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలకు భాగస్వామ్యం

జిల్లాలో ప్రధాన పోలీస్ స్టేషన్లు	25
2022లో	
రోడ్డు ప్రమాదాలు	725
మృతులు	262
క్షతగాత్రులు	760
2023లో	
రోడ్డు ప్రమాదాలు	694
మృతులు	277
క్షతగాత్రులు	706



గత జూన్ 12న 16వ నంబర్ జాతీయ రహదారిపై నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద లారీని ఢీకొని, ఏడుగురిని బలిగొన్న ప్రమాదంలో నుజ్జయిన కారు

సాక్షి, రాజమహేంద్రవరం: మితిమీరిన వేగం.. కనీస రోడ్డు భద్రతా చర్యలు తీసుకోకపోవడం.. మద్యం తాగి వాహనాలు నడపడం.. ట్రిపుల్ రైడింగ్.. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం.. ఇలా అనేక కారణాలతో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. పలువురిని క్షతగాత్రులుగా మిగులుస్తున్నాయి. వారి కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. ప్రమాదకర మార్గాలను గుర్తిస్తున్నా.. నిబంధనల అతిక్రమణలపై భారీగా కేసులు నమోదు చేస్తున్నా ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు నెత్తురోడుతూనే ఉంది. దీనికి సమన్వయంతో అడ్డుకట్ట వేసే దిశగా జిల్లా అధికార, పోలీసు యంత్రాంగాలు అడుగులు వేస్తున్నాయి. అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రజలను అప్రమత్తం చేయడంలో తలమునకలవుతున్నాయి.

ప్రమాదాలకు కారణాలెన్నో..

- నగరాలు, పట్టణాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నప్పటికీ ప్రజలు సక్రమంగా పాటించడం లేదు.
- ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా పలుచోట్ల **వేగంపై నియంత్రణ** ఉంది. ఉదాహరణకు గంటకు 40 కిలోమీటర్లకు మించిన వేగంతో వాహనాలు నడపకూడదనే ఆంక్షలున్నా చాలా మంది ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇతరులు తమ డ్రైవింగ్ నైపుణ్యం చూడాలనే మోజుతో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు.
- రోడ్డు మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించడం లేదు.
- కూడళ్లలో రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా దూకుడుగా ముందుకు దూసుకుపోతున్నారు.
- ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు జోరుగా వెళ్తున్నారు.
- పాత, కాలం చెల్లిన వాహనాలను యథేచ్ఛగా నడిపేస్తున్నారు.
- పోలీసులు నిషేధించిన ప్రాంతాల్లో వాహనాలు నిలుపుతున్నారు.
- విశ్రాంతి లేకుండా రాత్రింబవళ్లు వాహనాలను నడపడంతో డ్రైవర్లు ఒత్తిడికి గురవుతున్నారు.
- రద్దీగా ఉండే చోట ఎక్కువ సమయం వాహనాన్ని నిలిపివేసి, ఇతరులను ఇబ్బంది పెడుతున్నారు.

31 బ్లాక్‌స్పాట్ల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా అత్యధిక ప్రమాదాలు జరుగుతున్న 31 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. వీటిలో జాతీయ రహదారుల్లో 25, రాష్ట్ర రహదారుల్లో 4, ఇతర రోడ్లలో 2 ఉన్నాయని నిర్ధారించారు. 500 మీటర్ల పరిధిలో మూడు లేదా అంతకంటే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. వీటి వద్ద ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నారు.

ప్రమాదాల నివారణ దిశగా..

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, రవాణా శాఖ, జిల్లా అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలను, విద్యార్థులను సైతం భాగస్వాముల్ని చేస్తున్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అడుగులు వేస్తున్నారు.



ప్రమాదాల నివారణపై సూచనలిస్తున్న ఎస్పీ జగదీష్

ఇవీ ప్రధాన బ్లాక్‌స్పాట్లు

జాతీయ రహదారులపై..

పొట్టిలంక సెంటర్, కడియపులంక సెంటర్, బుర్రిలంక సెంటర్, వేమగిరి సెంటర్, ఇండస్ట్రియల్ కాలనీ, హార్లిక్స్ ఫ్యాక్టరీ, మోరంపూడి జంక్షన్, డీటీసీ సెంటర్, లాలాచెరువు సెంటర్, జీఎస్ఎస్ మెడికల్ కాలేజ్, నరేంద్రపురం జంక్షన్, కలవచర్ల జంక్షన్, తూర్పు గోనగూడెం, నిడిగట్ల సెంటర్, మధురపూడి ఎయిర్‌పోర్ట్, గామన్ బ్రిడ్జ్ వై-జంక్షన్, దొమ్మేరు, ఖండవల్లి సెంటర్, కాపవరం జంక్షన్, రాళ్లమడుగు బ్రిడ్జి, గోపాలపురం చెక్‌పోస్ట్ సెంటర్.

రాష్ట్ర రహదారులపై..

కోటిపల్లి బస్టాండ్, వడిశలేరు క్యాపిటల్ ఫ్యాక్టరీ, చాగల్లు సెంటర్, రోడ్డు కం రైల్వే బ్రిడ్జి ప్రాంతాలు.

ఇప్పటికే పోలీసులు 246 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మరిన్ని చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, ప్రత్యేక భద్రతా చర్యలు.
- ఎక్కువ రద్దీగా ఉండే ప్రాంతాల్లో పార్కింగ్ చేసే వాహనాలను తొలగించడం.
- ఫిట్‌నెస్ కలిగిన స్కూల్, కాలేజీ బస్సులకు మాత్రమే అనుమతులు.
- ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రెండు నెలల్లోగా రక్షణ చర్యలు చేపట్టడం.
- దేవరపల్లి వైపు, ఇతర జాతీయ రహదారులపై నిర్మించిన ఫ్లై ఓవర్లు, హై రిస్క్ బ్లాక్‌స్పాట్ల వద్ద సైన్ బోర్డుల ఏర్పాటు.
- జాతీయ రహదారులపై ప్రమాదాలు తగ్గించేలా ప్రణాళికలు రూపొందించడం. అవసరమైన చోట్ల వేగ నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు.
- ట్రాక్టర్లు, లారీల యజమానులతో సమావేశమై రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడం.
- ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల నిర్వహణ.
- మోటార్ సైకిళ్లు నడిపే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించడం.
- ప్రధాన జంక్షన్ల వద్ద రహదారి భద్రతపై అవగాహన కలిగించేలా డిజిటల్ స్క్రీన్ల ఏర్పాటు.

ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 19వ తేదీ వరకూ జిల్లాలో ప్రమాదాల వివరాలు

పోలీస్ స్టేషన్	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
రాజమహేంద్రవరం వన్ టౌన్	25	6	24
రాజమహేంద్రవరం టూ టౌన్	25	8	21
రాజమహేంద్రవరం త్రీ టౌన్	42	14	39
రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్	20	3	23
ధవళేశ్వరం	29	4	33
కడియం	45	12	45
రాజానగరం	52	26	52
కోరుకొండ	31	12	27
గోకవరం	33	14	28
బొమ్మూరు	55	26	51
రంగంపేట	25	14	27
కొవ్వూరు టౌన్	33	12	36
గోపాలపురం	25	14	23
దేవరపల్లి	56	40	54
సమిశ్రగూడెం	28	12	30
పెరవలి	37	9	45
నల్లజర్ల	30	19	35

తనిఖీలు చేస్తున్నా..

పోలీసులు ప్రతి రోజూ విస్తృతంగా తనిఖీలు చేస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధిస్తున్నా ఎటువంటి మార్పూ కనిపించడం లేదు.

మూడేళ్లుగా ఈ–చలానాల వివరాలు

సంవత్సరం	ఎంవీ యాక్ట్ కేసులు	జరిమానా (రూ.లలో)
2021	3,34,316	10,55,33,726
2022	2,01,382	7,69,70,039
2023 సెప్టెంబర్ వరకూ	58,962	2,54,66,320

మద్యం తాగి నడుపుతూ..

చాలా మంది మద్యం తాగి, వాహనాలు నడపడం కూడా ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోంది. ప్రతి రోజూ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తూ మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

మూడేళ్లుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల వివరాలు

సంవత్సరం	కేసులు	జరిమానా (రూ.లలో)
2021	4	6,000
2022	1,491	18,31,500
2023 సెప్టెంబర్ వరకూ	412	5,68,450

ప్రణాళికాబద్ధంగా ప్రమాదాల నివారణ



రవాణా, పోలీసు, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, విద్యుత్ తదితర శాఖల అధికారులు గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వద్ద ఉమ్మడిగా తనిఖీలు చేపట్టి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. ఎక్కువ ప్రమాదాలు జరిగేచోట సూచిక బోర్డులు, రెడ్ స్టిక్కరింగ్ ఏర్పాటు చేస్తాం. జాతీయ రహదారుల్లో దాబాల వద్ద వాహనాలు రాంగ్ పార్కింగ్ జరగకుండా అవగాహన కల్పిస్తాం. మైనర్లు వాహనాలు నడపకుండా చర్యలు తీసుకుంటాం. డ్రైవింగ్ లైసెన్స్ ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తాం.

– పి.జగదీష్, జిల్లా ఎస్పీ, రాజమహేంద్రవరం

జయహో దుర్గాభవానీ



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

సకల జీవరాశిలో బుద్ధి శక్తిగా.. జ్ఞాన శక్తిగా.. క్రియా శక్తిగా.. మాతృ శక్తిగా.. నిత్య చైతన్య రూపిణిగా.. సమస్త శక్తి స్వరూపిణిగా కొలువై ఉన్న ఆ అమ్మల గన్నయమ్మను.. దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు దుర్గామాతగా భక్తిప్రపత్తులతో పూజించారు. తన శక్తియుక్తులతో లోకకంటకులైన దుష్ట రాక్షసులను దునుమాడి.. ప్రజలను రక్షించిన ఆ ముగురమ్మల మూలపుటమ్మను 'యా దేవీ సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా' అంటూ స్తుతించారు. దుర్గతులను నశింపజేసి, సద్గతులను, ఆయురారోగ్యాలను ప్రసాదించే దివ్య స్వరూపిణి అయిన ఆ అమ్మవారిని.. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా.. పలు ఆలయాల్లో విజయదుర్గాదేవిగా, మహిషాసుర మర్దినిగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆ తల్లిని కనులారా దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. – సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)



నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

2 నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 2 నుంచి 10 వరకు 9 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు ఆహ్వాన పత్రికతో పాటు పోస్టర్లు సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను స్వామివారి వద్ద ఉంచి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో పాటు భక్తులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, స్వామి వారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తజనకోటి బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో నవమూర్తి ఆవాహన, ధ్వజారోహణ, శ్రీనివాస కల్యాణం, మహా సుదర్శన హోమం, అష్టదళ పాదపద్మారాధన, పారమార్థిక ఉపనిషత్ పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకం, నవగ్రహ హోమం, తిరుప్పావడ సేవ, సంతాన గోపాల మూలమంత్ర పూర్వక హోమం, సామూహిక కుంకుమార్చన, మహాలక్ష్మి మూలమంత్ర పూర్వక మహాలక్ష్మి హోమం, మహాపుష్పయాగం, మహాపూర్ణాహుతి, అవభృథ స్నానం, చూర్ణోత్సవం, మహదాశీర్వచనం తదితర ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించాల్సిన అష్టోత్తర పూజలు, కల్యాణాలు, ఉపనయనాలు, వివాహాలు రద్దు చేశామని చైర్మన్, ఈఓ తెలిపారు. బ్రహ్మోత్సవ ఆర్జిత సేవలకు రూ.1,116 చెల్లించే భక్తులు నగదు, డీడీలు, మనీ యార్డర్లను 'ఈఓ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, వాడపల్లి, ఆత్రేయపురం మండలం' చిరునామాకు పంపించి రసీదు పొందాలని కోరారు.

క్లుప్తంగా

కుటుంబ వేడుకలా విజయదశమి

ఆంధ్రా సుగర్స్ చైర్మన్, ఎండీ నరేంద్రనాథ్ చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ముళ్లపూడి నరేంద్రనాథ్ చౌదరి

తణుకు: ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో ఏటా దసరా ఉత్సవాలను కుటుంబ వేడుకల్లా నిర్వహిస్తున్నామని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో స్థానిక సిల్వర్ జూబ్లీ పార్కులో జరిగిన వేడుకలకు ఆయన అధ్యక్షతన వహించి మాట్లాడారు. ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. సంస్థ అడిషినల్ సెక్రటరీ పీవీఎస్ విశ్వనాథకుమార్ మాట్లాడుతూ అంతరిక్షంలో ప్రయోగించే రాకెట్లకు ఉపయోగపడే ఇంధనం ఇక్కడి నుంచే సరఫరా చేయడం గర్వకారణం అన్నారు. చరిత్రాత్మక మిషన్ చంద్రయాన్–3, గగనయాన్ ప్రాజెక్టులో భాగస్వాములైనందుకు గర్విస్తున్నామన్నారు. సినీనటుడు వెల్లంకి నాగినీడు, వాస్తు, జ్యోతిష ప్రవీణ, అష్టావధాని డాక్టర్ ప్రభల సుబ్రహ్మణ్యశర్మ, సంస్థ జీఎం (హెచ్ ఆర్) ఎ.సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) కె.వెంకటరత్నం పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తుని: రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్‌మారూఫ్ ఆదివారం తెలిపారు. పిఠాపురం–గొల్లప్రోలు రైల్వేస్టేషన్ల మధ్య పిఠాపు రం నుంచి తుని వైపు వస్తున్న రైలు కింద పడి 60 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎటువంటి ఆధారాలు లభించలేదు. శవాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. వివరాలకు 9494887786, 9490619020 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విహార యాత్ర..విషాదాంతం

- గల్లంతైన నలుగురు యువకుల మృతదేహాలు లభ్యం
- కాకినాడ జీజీహెచ్‌కు తరలించిన పోలీసులు

తాళ్లరేవు: పుట్టినరోజు వేడుకను జరుపుకుందామని పశ్చిమగోదావరి జిల్లా తణుకు నుంచి కేంద్రపాలిత ప్రాంతమైన యానాంకు వచ్చిన యువకుల విహారయాత్ర విషాదాంతమైంది. గోపులంక వద్ద గోదావరిలో గల్లంతైన పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన హనుమకొండ కార్తీక్, ముద్దన ఫణీంద్ర గణేష్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. తణుకు సజ్జాపురంలోని ఒకే వీధికి చెందిన ఏడుగురు యువకులు శనివారం బర్త్‌డే పార్టీకి యానాం వచ్చి తిరిగి వెళుతూ గోపులంక వద్ద స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, కాకినాడ రూరల్ సీఐ పి.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. శనివారం రాత్రి 10 గంటల వరకు కొనసాగించిన గాలింపు చర్యలు, తిరిగి ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభించారు. కాకినాడ, జగన్నాథపురం అగ్నిమాపక శాఖలకు చెందిన సుమారు 10 మంది సిబ్బందితోపాటు, 21 మంది ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు. యువకులు స్నానానికి దిగిన ప్రాంతానికి సమీపంలోనే మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానిక మత్స్యకారులు కట్టిన వలలకు గణేష్, బాలాజీ మృతదేహాలు చిక్కుకోగా మిగిలిన రెండు మృతదేహాలను సుమారు మూడు గంటలపాటు శ్రమించి బయటకు తీశారు. ఆయా మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల బంధువుల రోదనలతో గోపులంక ప్రాంతంలో విషాదం నెలకొంది. చేతికి అందివచ్చే సమయంలో యువకులు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మానవత్వం చాటిన సీఐ శ్రీనివాస్

నదిలో గల్లంతైన యువకుల మృతదేహాలను వెలికితీసేందుకు ఎంతగానో శ్రమించిన స్థానిక మత్స్యకారులకు కాకినాడ రూరల్ సీఐ పి.శ్రీనివాస్ రూ.5వేల నగదు ఇచ్చి మానవత్వాన్ని చాటారు. యువకులు గల్లంతైనప్పటి నుంచి మత్స్యకారులు వెన్నంటే ఉండి గాలింపు చర్యలు చేపట్టడంతోపాటు మృతదేహాలను వెలికితీయడంలో సిబ్బందికి సహకరించారని సీఐ అభినందించారు.



గోదావరిలోంచి మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది



కుమారుడు మృతితో బోరున విలపిస్తున్న సాయి కార్తీక్ తండ్రి విజయ్‌కుమార్

స్కూబా డైవింగ్ నిపుణుడు ప్రకాష్‌బాబు సాహసం



ప్రకాష్ బాబు

యువకుల మృతదేహాలను వెలికితీయడంలో కొవ్వూరు ఫైర్‌స్టేషన్ స్కూబా డైవింగ్ నిపుణుడు ప్రకాష్ సాహసం చేశారు. ఆక్సిజన్ సాయంతో సుమారు 70 అడుగుల లోతులో మూడు గంటల పాటు శ్రమించడంతో కార్తీక్, రవితేజ మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ సందర్భంగా ప్రకాష్‌ను అగ్నిమాపకశాఖ డీఎఫ్ఓ సురేంద్రన్, ఏఎఫ్ఓ సిబ్బంది అభినందించారు.

కన్నవాళ్లను కన్నీళ్లలో వదలి..

నాలుగు కుటుంబాలకు కొడుకులు దూరం

కాకినాడ క్రైం: తమ కడవరకు తోడుండి వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాచుకుంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు ప్రాణాలు గంగపాలై మృత్యు ఒడికి చేరితే కన్నీళ్లే దిక్కయ్యాయి ఆ తల్లిదండ్రులకి. పున్నామ నరకం నుంచి తప్పిస్తాడనుకున్నారే గానీ రెండు పదుల ప్రాయం దాటిన రెండేళ్లకే నూరేళ్లు నిండిపోతాయని కల్లోనైనా ఊహించలేదు వాళ్లు. తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర్‌ఘాట్ గౌతమి గోదావరి తీరం విషాదాంతాన్ని లిఖించింది. బంగారు భవిత కోసం కొండంత ఆశతో ఇప్పుడిప్పుడే తమ జీవితాలను ప్రారంభిస్తున్న నలుగురు యువకుల ఆయువులు తనలో కలిపేసుకొని ఆ నాలుగు కుటుంబాల్లో పెను విషాదాన్ని మిగిల్చింది.

స్వస్థలాలకు మృతదేహాలు

కాకినాడ జీజీహెచ్‌లో ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి చేసి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. తాళ్లరేవు, తణుకు ఎంఆర్‌వోలు మార్చురీ వద్ద ఉండీ పోస్టుమార్టం ప్రక్రియను పర్యవేక్షించి స్వగ్రామాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. నలుగురి యువకుల మృతదేహాలను రెండు మహాప్రస్థానం వాహనాల్లో స్వస్థలాలకు చేర్చారు.



పోస్టుమార్టం అనంతరం జీజీహెచ్ మార్చురీ నుంచి స్వస్థలాలకు మృతదేహాల తరలింపు

'అమ్మా.. నిన్ను చక్కగా చూసుకుంటాననేవాడు'



తణుకు మండలం సజ్జాపురం గ్రామంలో తల్లితో కలిసి నివసిస్తున్న పెండ్యాల బాలాజీ (21) ఏకైక కుమారుడు. తండ్రి నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోతే ఇంటి బాధ్యతలు తల్లి వెంకటలక్ష్మి తీసుకున్నారు. స్థానిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. బాలాజీ చదువులో చురుకైనవాడు స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం ట్రిపుల్ ఈ చదువుతున్నాడు. తన అక్క భావనలా మంచి ఉద్యోగం సంపాదిస్తానని తల్లికి చెప్పేవాడు. క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగం తప్పకుండా సాధిస్తానని భరోసా ఇచ్చేవాడు. తనకు ఉద్యోగం వస్తే నిన్ను ఇంట్లో పెట్టి చక్కగా చూసుకుంటానని తన తల్లితో అనేవాడని బాలాజీ మేనమామ బోయపాటి వెంకట సత్యనారాయణ కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు.

సొమ్మసిల్లిన కన్నతల్లి



కొడుకు చనిపోయాడన్న విషయం పోస్టుమార్టం పూర్తయ్యేవరకు ఆ తల్లికి తెలియకుండా దాచే ప్రయత్నం చేశారు కుటుంబ సభ్యులు. నీటిలో పడిపోయాడు అని తెలిసిన వెంటనే మృతుడు తిరుమల రవితేజ(20) తల్లి దేవి ఫిట్స్‌కు గురై ప్రమాదకర స్థితికి చేరుకున్నారు. దీంతో వైద్యులు మత్తు ఇచ్చి ఆమెను శాంతింపజేశారు. ఆదివారం సాయంత్రం కుమారుడి మృతదేహం ఇంటికి చేరే కొద్ది సమయానికి ముందు మత్తులో నుంచి మేల్కొని కొడుకు బాగోగుల కోసం ఆరా తీయగా లేడన్న చేదు నిజాన్ని బంధువులు ఆమెకు చెప్పారు. అంతే.. గుండెలు బాదుకొని దేవి పడిపడి ఏడ్చింది. ఆమెను సముదాయించడం ఎవరి వల్లా కాలేదు. ఆమె వేదనను చూసిన వారి కళ్లు చమర్చాయి. రవితేజకు యానిమేషన్ రంగం అంటే ప్రాణం అని హైదరాబాద్ వెళ్లి అదే రంగంలో ఉద్యోగం పొంది అక్కడే స్థిరపడతానని అనేవాడని చెబుతూ బంధువులు విలపించారు. రవితేజ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లాలోని పైడిపర్రు గ్రామం. డిగ్రీ పూర్తి చేశాడు. తణుకు రైల్వేస్టేషన్ సమీపంలో నివసిస్తున్నాడు.

అయ్యప్పా... ఏంటీ ఘోరం...



తణుకు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన అనుమకొండ విజయ్‌కుమార్ దంపతులకు సాయి కార్తీక్(20) ఒక్కగానొక్క కుమారుడు. స్థానిక సోనోవిజన్ షోరూంలో పనిచేస్తూ కుమారుడిని విజయ్ ఇంజినీరింగ్ చదివిస్తున్నారు. కుమారుడి మరణానికి ఒక్క రోజు ముందు విజయ్ అయ్యప్పమాల వేశారు. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం కన్నబిడ్డ మృతదేహాన్ని చూస్తూ అయ్యప్పా అంటూ దేవుడిని స్మరిస్తూ ఏంటీ ఘోరమని కన్నీటి పర్యంతమైన తీరు హృదయాల్ని కదిలించింది. రెండేళ్లలో మంచి ఉద్యోగం సాధించి తన కోసం తన చిన్నప్పటి నుంచి కష్టించి పనిచేస్తున్న తండ్రి రుణం తీర్చుకుంటాననీ, మంచి ఉద్యోగం సాధించి అపాయింట్‌మెంట్ లెటర్ చేతిలో పెట్టి సర్‌ప్రైజ్ చేస్తానని చెప్పేవాడని తోటి స్నేహితులు కన్నీళ్లు నిండిన కళ్లతో కార్తీక్ మాటల్ని గుర్తు చేసుకున్నారు.

దర్జీ కొడుకు ఇంజినీరు అనిపించుకోవాలని....



దర్జీ కొడుకు ఇంజినీరు అయ్యాడు అనిపించుకుంటా అని ముద్దన ఫణీంద్ర గణేష్(20) అంటూండే వాడని అతడి సహ విద్యార్థులు చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. జీవనోపాధి కోసం తండ్రి దుబాయ్ వెళ్లి అక్కడ దర్జీగా జీవనాన్ని కొనసాగిస్తూ భార్యాబిడ్డల కోసం కష్టపడుతున్నాడు. తణుకులో నివాసం ఉండే గణేష్ స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో బీ టెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. జీవితం కోసం ఎన్నో కలలు కంటూ తండ్రి కష్టాన్ని చెరిపేస్తానని.. తన భర్త ఎలా ఉన్నాడో అంటూ తలుచుకుంటూ బాధపడుతుండే తల్లి ధనలక్ష్మితో అనేవాడని మావయ్య సాయికృష్ణ ఆవేదన చెందారు.

బరువులు ఎత్తారు.. పతకాలు పట్టారు

ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన 150 మంది క్రీడాకారులు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీ రాజరాజేశ్వరి కల్యాణ మంటపంలో తోరం రమేష్ మెమోరియల్ మూడో యునైటెడ్ ఈస్ట్ గోదావరి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ మెన్ అండ్ వుమెన్ పోటీలు ఆదివారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ సాగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. బరువులు ఎత్తుతాం..పతకాలు సాధిస్తామనే పట్టుదల, ఆత్మ విశ్వాసం ఆ లిఫ్టర్లలో కనిపించింది. అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంటక వీరీతాదేవి జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, పోటీల పర్యవేక్షకుడు, అమలాపురం హెల్త్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, మున్సిపల్ కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. మొత్తం 12 కేటగిరీల్లో పోటీలు జరిగాయి. వుమెన్, మాస్టర్స్ విభాగాల్లో సాయంత్రానికి పోటీలు ముగిసినప్పటికీ మెన్ విభాగం పోటీలు అర్ధరాత్రి వరకూ కొనసాగనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు తెలిపారు.

వుమెన్, మాస్టర్స్ విభాగాల్లో విజేతలు వీరే

ఆదివారం రాత్రి వరకూ పోటీలు పూర్తయిన వుమెన్, మాస్టర్స్ విభాగాల విజేతలను పోటీల పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వుమెన్ విభాగంలో ఎం.శ్రీయ (ముమ్మిడివరం) బంగారు పతకాన్ని, పి.వందన (అమలాపురం) ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతాకాన్ని, యు.శశికళ (అమలాపురం) తృతీయ స్థానంతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. మాస్టర్స్ విభాగంలో సీహెచ్ కిరణ్‌కుమార్ (అమలాపురం) బంగారు పతకాన్ని, డీఆర్‌కే నాగేశ్వరరావు (ద్రాక్షారామ) రజత పతాకాన్ని, బి.హేమ వెంకటరత్నం (అమలాపురం) కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. లిఫ్టర్లు 12 విభాగాల్లో 80 కిలోల నుంచి 200 కిలోల వరకూ బరువులు ఎత్తి సత్తా చాటారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా లిఫ్టింగ్ నిపుణులు దొమ్మేటి వెంకటరమణ, ఎస్వీ సముద్రం, డీవీవీ సత్యనారాయణ, డి.లక్ష్మీనారాయణ వ్యవహరించారు.



పతకాలతో వుమెన్ విజేతలు. చిత్రంలో అతిథులు, జిల్లా లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

బియ్యం వ్యాపారి హత్య

వరి పొలంలో మృతదేహం పూడ్చివేత



తాతబ్బాయి (ఫైల్)

సామర్లకోట: మండల పరిధిలో చంద్రంపాలెం గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి హత్య సంచలనం రేకెత్తించింది. గ్రామానికి చెందిన జల్లిగంపల తాతబ్బాయి (80) బియ్యం వ్యాపారం చేస్తూ గ్రామ ప్రజల మన్ననలు పొందారు. శనివారం సాయంత్రం వరకు గ్రామంలో ఉన్న తాతబ్బాయి రాత్రి ఇంటికి రాలేదు. దాంతో తాతబ్బాయి కుటుంబ సభ్యులు గాలించారు. ఆదివారం ఉదయం పొలం గట్టు మీదుగా మనిషిని ఈడ్చుకొంటూ తీసుకు వెళ్లినట్టు గుర్తులు ఉండటంతో పొలంలో గడ్డి కోసుకొనే రైతులు గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. దాంతో గ్రామ నాయకులు రాజరాజేశ్వరీ ఆలయ సమీపంలో ఉన్న పొలంలో గాలించారు. వరి పొలం మధ్యలో తాతబ్బాయి మృతదేహాన్ని పూడ్చినట్టు గుర్తించారు. ఈ మేరకు గ్రామానికి చెందిన మండల పరిషత్తు కోఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్, తలాటం శ్రీను పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెద్దాపురం డీఎస్పీ లతకుమారి, సీఐ కె.దుర్గాప్రసాద్ తమ సిబ్బందితో ఘటనా ప్రదేశానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. మృతుడు తాతబ్బాయి కుడి చేతికి నాలుగు ఉంగరాలు, మొల సంచి (చిక్కం)లో నగదు ఉంటుందని గ్రామ ప్రజలు తెలిపారు. అయితే ఉంగరాలు, నగదు కోసం తాతబ్బాయిని హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి సీఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

ఓబీసీ కుల గణన చేపట్టాలి

- వచ్చే నెల 19న శెట్టిబలిజ కార్తిక సమారాధన
- రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: శెట్టిబలిజ కార్తిక వన సమారాధన వచ్చే నెల 19న పెద్దఎత్తున నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కేంద్ర గణాంక సంస్థ చేపట్టే జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని కోరుతూ తీర్మానించారు. విద్యాపరంగా అభివృద్ధి చేయడానికి శెట్టిబలిజ సంఘాలను చైతన్య పరచాలని, వృత్తి, వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చెందడానికి శెట్టిబలిజ సంఘాలు మద్దతు తెలియజేయాలని కోరారు. శెట్టిబలిజ కార్పొరేషన్‌ను ఆర్థికంగా పరిపుష్టం చేసి దాని ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో సంఘీయులకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని, శెట్టిబలిజులు అధికంగా ఉండే ప్రతి నియోజకవర్గంలో విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగపడేలా కల్యాణ మంటపాలు నిర్మించాలని కోరుతూ తీర్మానించారు. తెలంగాణ శెట్టిబలిజలను బీసీల్లో చేర్చాలని పోరాటం చేస్తున్న అక్కడి శెట్టిబలిజ సంఘాలకు మద్దతు తెలియజేయాలని సమావేశం తీర్మానించింది. సంఘ నాయకులు అప్పారి జయప్రకాష్, న్యాయవాది ఇళ్ల శివప్రసాద్, అమలాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథరావు, మట్టపర్తి సత్యనారాయణ, కడలి కెరటాలు, దంగేటి వెంకట రామారావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ



చోరీ వివరాలు తెలుసుకుంటున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు: ఓ ఇంట్లో శనివారం రాత్రి దొంగలు చొరబడి రూ.6.20 లక్షల విలువ గల నగదు, బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. స్థానిక కొత్తపేటలో నివశిస్తున్న తిరుమలరౌతు కృష్ణ కిర్లంపూడిలోని సినిమా చూసి, తిరిగి వచ్చే సమయానికి ఇంటిలో దొంగలు పడి, దోచుకుపోయారు. పోలీసుల కథనం మేరకు కృష్ణ భార్య, పిల్లలు దసరా సెలవులు కావడంతో గ్రామాంతరం వెళ్లారు. ఒంటరిగా ఉన్న కృష్ణ ఇంటి తలుపులకు తాళం వేసుకుని, కిర్లంపూడిలో రెండవ ఆట సినిమాకి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు తాళం బద్దలు కొట్టి ఉంది. ఇంటిలో చూడగా బీరువా తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. ఏడు తులాల హారం, నక్లెస్, ఉంగరం, నగదు దోచుకుపోయినట్టు గమనించాడు. సుమారు 25 కాసుల బంగారు, వెండి ఆభరణాలు, రూ. 2 లక్షల నగదు దోచుకుపోయినట్టు తిరుమలరౌతు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఆదివారం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పరిశీలించారు. ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు



షీల్డ్ తీసుకుంటున్న శ్రీప్రకాష్ యోగా విజేతలు

తుని: తమిళనాడు రాష్ట్రంలో విల్వాంకులం అక్షర పబ్లిక్ స్కూల్లో శని, ఆదివారం జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్–1 యోగా పోటీల్లో స్థానిక శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–14 విభాగంలో బి.దేవాన్ష్‌నాయుడు, జి.సోమసూర్యచరణ్, రక్షిత్, నవనీత్ బృందం ద్వితీయస్థానం, అండర్–14 బాలుర వ్యక్తిగత యోగా విభాగంలో జి.సోమసూర్యచరణ్ నాల్గవ స్థానం సాధించారని సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తెలిపారు. విజేతలంతా వచ్చే డిసెంబర్‌లో సీబీఎస్ఈ జాతీయస్థాయిలో జరిగే యోగా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. జాతీయస్థాయి యోగ పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

రావూరుపాడులో అగ్ని ప్రమాదం



పూర్తిగా కాలిపోయిన తాటాకు ఇల్లు

తాళ్లపూడి: మండలంలోని రావూరుపాడులో ఓ ఇంట్లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కొలిశెట్టి కృష్ణారావు తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇటుక గోడలతో నిర్మించి పై కప్పు తాటాకు వేశారు. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి, నగదు, ఆభరణాలు, దుస్తులు, విలువైన పత్రాలు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. వీఆర్వో టి.సుజాత సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు.

ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కొవ్వూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పట్టణంలోని రెండో వార్డుకు చెందిన మానేపల్లి రాకేష్ మణికంఠ (18) అనే ఇంజినీరింగ్ విద్యార్థి శనివారం రాత్రి మృతి చెందాడు. పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మణికంఠ తన మిత్రుడైన చింతలపూడి సాయికృష్ణతో కలిసి శనివారం బైక్‌పై వెళుతున్నాడు. వారి బైక్ కొవ్వూరులోని సీఎన్‌జీ బంక్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. మిత్రులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కొద్ది సేపటికే చికిత్స పొందుతూ మణికంఠ మృతి చెందాడు. ప్రస్తుతం సాయికృష్ణ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెబుతున్నారు. అతడికి తలకు బలమైన గాయాలయ్యాయి. మృతుడు మణికంఠ తండ్రి వీర వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై భూషణం తెలిపారు.

డెలివరీ బాయ్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలి

కొవ్వూరు: గ్యాస్ కంపెనీల్లో పనిచేస్తున్న డెలివరీ బాయ్‌లకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు కోరారు. జిల్లా గ్యాస్ డెలివరీ బాయ్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఆదివారం స్థానిక హోలీ ఏంజెల్స్ పాఠశాల్లో జరిగింది. కార్యక్రమంలో సుందరబాబు మాట్లాడుతూ గ్యాస్ కంపెనీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. పని చేస్తున్న సమయంలో కార్మికులు ఏదైనా ప్రమాదం సంభవిస్తే యాజమాని బాధ్యత తీసుకుని వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు గట్టి కృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని 47 గ్యాస్ ఏజెన్సీల్లో సుమారు 800 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారందరికీ కార్మిక చట్టాలు సక్రమంగా అమలయ్యేలా కృషి చేస్తామన్నారు.

సత్యదేవునికి కొత్త తేరు

- రూ.34 లక్షలతో టేకు రథం నిర్మాణం
- దానిపై వెండి రేకు తాపడం
- సుమారు 300 కేజీల వెండి అవసరం
- తొలుత చిన్న రథం.. తరువాత పెద్దది

అన్నవరం: కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం అన్నవరం దేవస్థానంలో శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి, అమ్మవారిని ఊరేగించేందుకు సరికొత్త వెండి రథం సిద్ధమవుతోంది. టేకు కలపతో ఈ రథం తయారు చేసి, దానిపై వెండి రేకు అతికించాలని నిర్ణయించారు. టేకుతో తయారీకి రూ.34 లక్షల వ్యయం అవుతూండగా.. వెండి రేకు తాపడానికి సుమారు 300 కిలోల వెండి అవసరం కానుంది. వచ్చే కార్తిక మాసం నాటికి నూతన రథం తయారు చేసి స్వామి, అమ్మవార్లను ఊరేగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 18 మంది పనివారు 15 రోజులుగా స్థానిక పంపా సత్రంలో ఈ పనులు చేస్తున్నారు. కార్తిక మాసం నాటికి రథం పనులు పూర్తవుతాయని దీనిని తయారు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లకు చెందిన శ్రీ మాణిక్యాంబ శిల్పకళ వుడ్ వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, కొల్లాటి శ్రీనివాస్ తెలిపారు.

శిథిలావస్థలో ప్రస్తుత రథం

స్వామివారి ఊరేగింపులకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న వెండి రథం శిథిలావస్థకు చేరింది. చక్రాలు కూడా వదులయ్యాయి. దీంతోపాటు ఎక్కడికక్కడ ఊగిపోతోంది. కొత్త రథం తయారు చేయాలన్న ప్రతిపాదన పదేళ్లుగా ఉన్నా వివిధ కారణాలతో ఆ పని జరగలేదు. వెండి, బంగారం పనులు చేయించేటపుడు పలు సమస్యలు ఉత్పన్నమవుతాయి కాబట్టి ఎందుకొచ్చిన తలనొప్పి అని భావించి ఇన్నాళ్లూ వెనక్కు తగ్గారు. ప్రస్తుత రథం బాగోలేదని గమనించిన ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ కొత్త వెండి రథం తయారీకి ఉపక్రమించారు. దీంతోపాటు స్వామి, అమ్మవార్లను కొండ దిగువన ఊరేగించేందుకు పెద్ద రథం తయారీకి కూడా గతంలో ఈఓ తీర్మానం ప్రవేశపెట్టగా ధర్మకర్తల మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది.



సత్యదేవుని ప్రస్తుత వెండి రథం

ఈ రెండు రథాలూ టేకుతో తయారు చేస్తారు. చిన్న రథానికి వెండి రేకు తాపడం చేయాలని నిర్ణయించారు. రెండు రథాల నిర్మాణానికి టెండర్లు పిలవగా చిన్న రథం తయారీకి రూ.34 లక్షలు, పెద్ద రథం తయారీకి రూ.1.08 కోట్లకు శ్రీ మాణిక్యాంబ శిల్పకళ, వుడ్‌వర్క్స్ సంస్థ టెండర్ దక్కించుకుంది. ప్రస్తుతం చిన్న రథం మాత్రం తయారు చేస్తున్నారు. దీనిని బస్తరు టేకుతో తయారు చేస్తున్నామని కాంట్రాక్టర్ కొల్లాటి శ్రీనివాస్ చెప్పారు. ఈఓ ఆదేశాల మేరకు దేవస్థానం అధికారులు, వేద పండితులు ఈ రథం తయారీని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆ ప్రకారం రథం తయారు చేస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు.



నూతన రథం నమూనా

14 అడుగుల ఎత్తు, 6.3 అడుగుల వెడల్పు

ప్రస్తుతం తయారు చేస్తున్న వెండి రథం ఎత్తు 14 అడుగులు కాగా, వెడల్పు 6.3 అడుగులు. నాలుగు స్తంభాలపై శిఖరం వస్తుంది. నాలుగు చక్రాల మీద అందమైన లతలు చెక్కుతున్నారు. రథం మీద దేవతామూర్తులు, పలు ఆకర్షణీయమైన డిజైన్లు చిత్రీకరించనున్నామని శ్రీనివాస్ చెప్పారు. రథాన్ని మరింత అందంగా, పటిష్టంగా రూపొందించాల్సిందిగా ఈఓ ఆదేశించారని అన్నారు. తన తండ్రి కామేశ్వరరావు రథాల తయారీలో సిద్ధహస్తులని, ఆయన వద్ద ఈ విద్య నేర్చుకున్నానని చెప్పారు. ఇప్పటి వరకూ 50 రథాలు తయారు చేశామన్నారు. అంతర్వేది దేవస్థానం రథం తయారీలో కూడా తాము పాల్గొన్నామన్నారు. ఇప్పుడు తయారు చేస్తున్న సత్యదేవుని రథం వంద సంవత్సరాల వరకూ చెక్కు చెదరదని చెప్పారు.



రథం పీఠభాగం తయారు చేస్తున్న శిల్పులు



రథం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పండితులు, అధికారులు

కార్తికం నాటికి చిన్న రథం



కొత్త రథాన్ని టేకుతో తయారు చేయించి, దానిపై వెండి రేకు తాపడం చేయాలని నిర్ణయించాం. టేకుతో రథం తయారీ కార్తిక మాసం నాటికి పూర్తి చేయాల్సిందిగా కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ఆ తరువాత పెద్ద రథం తయారు చేయిస్తాం.

– చంద్రశేఖర్ ఆజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

ఘనంగా జక్కంపూడి గణేష్ వివాహం

ద్వారకాతిరుమల: తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి విజయ్ గణేష్‌మోహన్, నరసాపురం మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ కుమార్తె సుకీర్తిల వివాహ వేడుక ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై అతిరథ మహారథుల సమక్షంలో ఈ వేడుకను రమణీయంగా జరిపించారు. నూతన వధూవరులను టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ పీఏసీ సభ్యురాలు, గణేష్ తల్లి జక్కంపూడి విజయలక్ష్మి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, గోపాలపురం, నిడదవోలు, ఉంగుటూరు, నూజివీడు ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాస్ నాయు డు, పుప్పాల వాసుబాబు, మేక ప్రతాప్ అప్పారావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల చైర్మన్ బీవీఆర్ చౌదరి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ డైరెక్టర్ జక్కంపూడి కిరణ్, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆశీర్వదించారు.



గణేష్, సుకీర్తిలను ఆశీర్వదిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జక్కంపూడి విజయలక్ష్మి

అక్కినేని చిత్రాలు ఎప్పటికీ సజీవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చిత్రసీమకు మకుటం లేని మారాజుగా అక్కినేని నాగేశ్వరరావు వెలుగొందారని, ఆయన చిత్రాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని నటుడు, గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రా అన్నారు. గోదావరి జిల్లాల్లో ఎక్కువ సినిమా షూటింగ్స్ చేసిన ఘనత మహానటుడు అక్కినేని నాగేశ్వరరావుకు దక్కుతుందన్నారు. స్థానికంగా అక్కినేని కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో అభిమాని అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో అక్కినేని నెలవారీ శత జయంత్యుత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా రెండో నెల కార్యక్రమాన్ని జిత్ మోహన్‌మిత్ర కళావేదిక వద్ద ఆదివారం నిర్వహించారు. అక్కినేని నటించిన మహాత్ముడు చిత్రం ఇదే అక్టోబర్‌లో విడుదలై, 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేడుక నిర్వహించారు. ముద్రగడ ఏసుబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిత్ మోహన్‌మిత్ర మాట్లాడుతూ బుద్ధిమంతుడు, అందాల రాముడు వంటి ఎన్నో చిత్రాలు ఇక్కడ చిత్రీకరించారన్నారు. గోదావరి తీరంలో చిత్రీకరణ జరిగినప్పుడు అక్కినేనితో కలసి నటించడం తన అదృష్టమన్నారు. సీనియర్ పాత్రికేయుడు వాడ్రేవు దివాకర్‌ని జిత్ మోహన్‌మిత్రా, ముద్రగడ ఏసుబాబు, అయ్యగారి వెంకట్రామయ్య తదితరుల చేతులమీదుగా దుశ్శాలువా, పూలమాలతో మరిడయ్య సత్కరించారు. వెంకట్రామయ్య మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ దివాకర్‌ని సత్కరించడం అభినందనీయమని పద్యాలు ఆలపించారు. అలాగే జిత్ మోహన్ మిత్రాను శాలువాలతో సత్కరించి, మెమెంటో అందజేశారు. శేషగిరిరావు, రామచంద్రరావు తదితరులు అక్కినేని సినిమాల్లో గీతాలను ఆలపించారు. సుక్కురెడ్డి శ్రీనివాసరావు, సీతారామారావు, డీఎస్ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ పాత్రికేయుడు దివాకర్‌ను సత్కరించిన జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

నది లేనిచోట వంతెన నిర్మిస్తారట!

- సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ తప్పుడు హామీలిస్తున్నారు
- మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఆగ్రహం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఓటర్లను మభ్యపెట్టడానికి ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ తప్పుడు హామీలు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ సీఎం కమల్‌నాథ్ ఆరోపించారు. ఇప్పటికే 22,000కుపైగా హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. నది లేని చోట వంతెన నిర్మిస్తామని చెబుతున్నారని, ఇదెక్కడి చోద్యమని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీకి బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్‌ను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం గోపాల్‌గంజ్‌లో ఎన్నికల ప్రచార సభలో కమల్‌నాథ్ ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీ పాలనలో అవినీతి, నిరుద్యోగం పెరిగిపోయాయని ఆరోపించారు. ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ హయాంలో ప్రతి పనిలో '50 పర్సెంట్ కమిషన్' దందా విచ్చలవిడిగా సాగుతోందని కమల్‌నాథ్ మండిపడ్డారు.

ఎన్‌డీఏను ఓడించేది పీడీఏనే

సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ • ప్రతిపక్ష 'ఇండియా'కూటమి పేరెత్తకుండా వ్యాఖ్యలు • కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో తాజా పరిణామం




న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తమకు ఒక్క సీటూ కేటాయించకపోవడంపై గుర్రుగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తాజాగా 'పీడీఏ'బాంబు పేల్చారు. ఆదివారం ఆయన 'ఎక్స్'లో ఇందుకు సంబంధించి చేసిన పలు వ్యాఖ్యలు ఇండియా కూటమి ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. 'వచ్చే ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏను పీడీఏ ఓడిస్తుంది. ఆ ఎన్నికల్లో పీడీఏ విప్లవం తెస్తుంది' అని అందులో పేర్కొన్నారు. పీడీఏ అంటే పిచ్డే(వెనుకబడిన కులాలు), దళితులు, మైనారిటీలని వివరించారు. 2024 ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సారథ్యంలో ప్రతిపక్షాలతో ఏర్పాటైన 'ఇండియా'కూటమిలో సమాజ్‌వాదీ పార్టీ కీలక భాగస్వామి. నవంబర్ 17న మధ్యప్రదేశ్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు గాను 18 నియోజకవర్గాల్లో ఎస్పీ అభ్యర్థులను నిలిపింది. తమకు ఆ సీట్లను కేటాయించాలంటూ కాంగ్రెస్ పార్టీని కోరింది. కాంగ్రెస్ ఎస్పీ వినతిని పట్టించుకోలేదు. ఆయా స్థానాలకు సైతం అభ్యర్థులను ప్రకటించింది. ఈ పరిణామం రుచించని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ కాంగ్రెస్‌పై పలు విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు కూడా ఎదురు దాడికి దిగారు. 'కాంగ్రెస్ ఇతర పార్టీలను ఫూల్ చేస్తోంది. రాష్ట్ర స్థాయిలో పొత్తులు పని చేయవని తెలిసుంటే, ఇండియా కూటమిలో చేరి ఉండేవాళ్లం కాదు. కాంగ్రెస్‌తో మాట్లాడేవాళ్లమే కాదు'అని గురువారం పేర్కొన్నారు. కాంగ్రెస్ తీరు ఇలాగే కొనసాగితే, ఆ పార్టీతో కలిసుండే దెవరని ప్రశ్నించారు. తమతో పొత్తు కొనసాగిస్తారా లేదా కాంగ్రెస్ తేల్చాలని పట్టుబట్టారు. ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కేంద్ర స్థాయిలో ఏర్పాటైందంటూ కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. మూడు రోజులుగా వారి మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్న వేళ..ఆదివారం తాజాగా అఖిలేశ్ 'పీడీఏ'అస్త్రం బయటకు తీశారు. 2024 ఎన్నికల్లో పీడీఏ విప్లవం సృష్టించనుందని పేర్కొన్నారు. అందులో ఇండియా కూటమి గురించి అందులో ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం.

'మాపై కుట్రలు, ద్రోహం చేయవద్దు. సమాజ్‌వాదీలు అవసరం లేదని వారు మాకు సూటిగా చెప్పాలి. పొత్తుపై ఒక్కసారి కూడా మాట్లాడబోమని, బీజేపీని ఓడించడానికి సొంతంగా మా ప్రయత్నాల్లో ఉంటామని'అన్నారు. గతంలో కుల గణన అంటే మండిపడిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దానిని కోరుకోవడం విడ్డూరంగా ఉందని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. గతంలో చేపట్టిన కులగణన వివరాలను ఆ పార్టీ వెల్లడించనేలేదు. బీసీల మద్దతు లేకుండా గెలుపు సాధ్యం కాదని ఇప్పుడు అందరూ గ్రహించారు. బీసీలు తమతో లేరని కాంగ్రెస్ తెలుసుకుంది కాబట్టే, ఇప్పుడు కులగణన హామీలిస్తోందని వివరించారు.

రైతులే కీలకం

అన్నదాతల కోసం ఎన్నో పథకాలు తెచ్చాం

- అసెంబ్లీ ఎన్నికల్లో 75పైగా సీట్లు ఖాయం
- పీటీఐ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి త్వరలో జరిగే ఎన్నికల్లో రైతులదే నిర్ణాయక పాత్ర అని సీఎం భూపేశ్ బఘేల్ చెప్పారు. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకువచ్చిందని, వారి మద్దతుతో అసెంబ్లీలోని 90 సీట్లకు గాను 75కు పైగా స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం బఘేల్ తాజాగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. మహిళలు, యువత, వ్యాపారులు కూడా తమ పార్టీ వెంటే ఉన్నారని ఆయన చెప్పారు. 'మేం ప్రవేశపెట్టిన పథకాలతో రైతులు, యువ లబ్ధిదారులు ఆర్థికంగా బలపడ్డారు. ఈ డబ్బు మార్కెట్‌లోకి చేరడంతో వ్యాపారులు సంతోషంగా ఉన్నారు. రైతులకు, తునికాకు సేకరణదారులకు ఇచ్చిన హామీలను గత అయిదేళ్లలో అమలు చేశాం. విద్య, ఆరోగ్యం, మౌలిక రంగాల కోసం ఎంతో ఖర్చు చేశాం. ఆయా రంగాల అభివృద్ధి కోసం చేపట్టిన పనులతో ప్రజల జీవితాల్లో ముఖ్యంగా ఆర్థికపరంగా ఎంతగానో మార్పు వచ్చింది'అని సీఎం బఘేల్ చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మద్య నిషేధం హామీలుకు ఎంతగానో ప్రయత్నించామన్నారు. అయితే, కొందరు కల్తీ మద్యం వాడకం మొదలుపెట్టి మృత్యువాత పడటంతో నిషేధం యోచనను విరమించుకున్నట్లు వివరించారు. '15 ఏళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మద్యంపై నిషేధం మాటే ఎత్తలేదు. దేశవ్యాప్తంగా మద్య నిషేధం అమలు చేయాలని ప్రధాని మోదీని డిమాండ్ చేస్తున్నా'అని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. 'గిరిజనులకు ఎంతో కీలకమైన జల్, జంగల్, జమీన్(నీరు, అటవి, భూమి)హక్కుల సమస్యను పరిష్కరించాం. ఒకప్పుడు రణరంగాన్ని తలపించిన బస్తర్‌లో నేడు ప్రశాంతత నెలకొంది. ఇవన్నీ మాకు ఎన్నికల్లో కలిసొచ్చే అంశాలే'అని ఆయన తెలిపారు. 'రైతుల నుంచి ఎకరానికి 20 క్వింటాళ్ల ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) ద్వారా కేంద్రం మాకు సాయం చేయడం లేదు. అందుకే మేం సొంతంగా గృహ నిర్మాణ పథకం ప్రారంభించాం. కులగణన చేపడతామని మా నేత ప్రియాంకా గాంధీ ప్రకటించారు. ప్రధానంగా వీటిని మేం ప్రకటించినా ప్రతిపక్ష బీజేపీ మాత్రం వీటిపై మౌనంగా ఉంది. పైపెచ్చు మాపై విమర్శలు మాత్రం చేస్తోంది'అని అన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పాత పింఛను విధానం కారణంగా రాష్ట్ర ఖజానాపై 2060 వరకు అదనంగా ఎలాంటి భారం పడబోదని చెప్పారు. కొత్త పింఛను విధానంలో భాగంగా సేకరించిన రూ.17 వేల కోట్లను కేంద్రం వాపసు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబర్ 7, 17వ తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

ముస్లింల ఓట్లపై కాంగ్రెస్ గురి

మధ్యప్రదేశ్‌లోని 47 స్థానాల్లో మైనార్టీల ప్రాబల్యం • 22 స్థానాల్లో నిర్ణయాత్మక శక్తిగా ముస్లిం ఓటర్లు

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష కాంగ్రెస్ పార్టీ ఈసారి మైనార్టీ ఓట్లపై గంపెడాశలు పెట్టుకుంది. మైనార్టీల్లో మెజార్టీ ఓట్లు దక్కించుకుంటే చాలు అధికారం హస్తగతమైనట్లేనని కాంగ్రెస్ నాయకులు నమ్ముతున్నారు. 2011లో మధ్యప్రదేశ్ జనాభాలో ముస్లింలు 7 శాతం ఉన్నారు. ఇప్పుడు 10 శాతానికి చేరి ఉండొచ్చని అంచనా. రాష్ట్రంలో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలుండగా, 47 స్థానాల్లో ముస్లింల ఓట్లు గణనీయంగా ఉన్నాయి. వీటిలో 22 స్థానాల్లో ముస్లింల ఓట్లే నిర్ణయాత్మక శక్తి కావడం విశేషం. 47 స్థానాల్లో వారి ఓట్లు 5 వేల నుంచి 15 వేల దాకా ఉన్నాయి. 22 స్థానాల్లో 15 వేల నుంచి 35 వేల వరకూ ఉన్నాయి. 2018 ఎన్నికల్లో బీజేపీకి 41.02 శాతం, కాంగ్రెస్‌కు 40.89 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీ కంటే తక్కువ శాతం ఓట్లు లభించినప్పటికీ కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలుచుకుంది. 114 సీట్లతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీకి 109 సీట్లు గెలుచుకుంది. రెండో స్థానంలో నిలిచింది. సమాజ్‌వాదీ, బహుజన సమాజ్‌వాదీ పార్టీలతో పాటు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కేవలం 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి ఫిరాయించారు. దాంతో శివరాజ్‌సింగ్ చౌహాన్ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.



ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు

మధ్యప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. 2018 ఎన్నికల్లో ముస్లింల మద్దతు వల్లే కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు లభించాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ముస్లిం ఓటర్లలో 90 శాతం తమకు అనుకూలంగా ఓటు వేస్తే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అంటున్నారు. రాష్ట్రంలో బీజేపీ సర్కారుపై మైనార్టీల్లో వ్యతిరేకత పెరిగిపోయిందని, అంతిమంగా అది తమకు లాభిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీలను ఆకట్టుకొనేందుకు కాంగ్రెస్ నాయకులు వ్యూహాలు రచిస్తున్నారు. మైనార్టీల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

అసెంబ్లీలో ఇద్దరే ముస్లిం ఎమ్మెల్యేలు

రాష్ట్ర శాసనసభలో ముస్లింల ప్రాతినిధ్యం క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఇద్దరు ముస్లిం ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇద్దరూ కాంగ్రెస్‌కు చెందినవారే. గత ఎన్నికల్లో భోపాల్ నార్త్ నుంచి ఆరిఫ్ అకీల్, భోపాల్ సెంట్రల్ నుంచి ఆరిఫ్ మసూద్ విజయం సాధించారు. చాలాఏళ్లుగా వారు ఆయా స్థానాల నుంచి కాంగ్రెస్ టికెట్‌పై విజయం సాధిస్తున్నారు. వారిని ఓడించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈసారి ఎన్నికల్లో భోపాల్ నార్త్ నుంచి ఆరిఫ్ అకీల్ తనయుడు ఆతీఫ్ అకీల్ పోటీ చేస్తున్నారు. ఆయనపై బీజేపీ అభ్యర్థిగా భోపాల్ మాజీ మేయర్ అలోక్ శర్మ పేరు ఖరారైంది. ఇక భోపాల్ సెంట్రల్ నుంచి ఆరిఫ్ మసూద్ మరోసారి పోటీ చేయబోతున్నారు. ఇక్కడ బీజేపీ తమ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ధ్రువ్ నారాయణ్ సింగ్‌ను ప్రకటించింది. 230 స్థానాలకు గాను కేవలం ఇద్దరు ముస్లింలకు టికెట్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ వర్గం మొత్తం ఓట్లు కొల్లగొట్టాలని భావిస్తోందని మధ్యప్రదేశ్ వక్ఫ్ బోర్డు చైర్మన్, బీజేపీ అధికార ప్రతినిధి శాన్వార్ పటేల్ విమర్శించారు. మైనార్టీలను కాంగ్రెస్ దగా చేస్తోందని ఆరోపించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పంచతంత్రం

రాజస్తాన్‌లో 43 మందితో కాంగ్రెస్ మరో జాబితా

న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ ఆదివారం 43 మంది అభ్యర్థుల పేర్లతో మరో జాబితా విడుదల చేసింది. మాజీ చీఫ్ సెక్రటరీ నిరంజన్ ఆర్యకు ఎస్సీ రిజర్వుడు స్థానం సోజత్‌ను కేటాయించింది. మంత్రులు రాజేంద్ర సింగ్ యాదవ్‌ను కొట్‌పుట్లి నుంచి, ప్రతాప్ సింగ్‌ను సివిల్ లేన్స్, శకుంతలా రావత్‌ను బన్సూర్ నుంచి బరిలోకి దించనుంది.

ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ తుది జాబితా విడుదల

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ ఏడుగురు అభ్యర్థులతో కూడిన తుది జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో అంబికా దేవ్‌కు బైకుంఠ్ సీటును, చతురి నంద్‌కు సరాయ్‌పాలి, రశ్మీ చంద్రశేఖర్‌కు మహాసముంద్‌ను, సందీప్ సాహుకు కస్డోల్‌ను, కుల్దీప్ జునేజాకు రాయ్‌పూర్ సిటీ నార్త్, అంబికా మార్కమ్‌కు సిహావా సీట్లను కేటాయించింది.

కాంగ్రెస్ అభ్యర్థులు నేర చరిత్రను తెలపలేదు

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల అధికారులకు బీజేపీ ఫిర్యాదు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన 83 మంది కాంగ్రెస్ అభ్యర్థులు తమ నేర చరిత్ర వివరాలను ఎన్నికల సంఘానికి వెల్లడించలేదంటూ ప్రతిపక్ష బీజేపీ రాయ్‌పూర్‌లోని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో)కి ఫిర్యాదు చేసింది. బీజేపీవి తప్పుడు ఆరోపణలంటూ అధికార కాంగ్రెస్ కొట్టిపారేసింది. రాష్ట్ర అసెంబ్లీలోని 90 సీట్లకు నవంబర్ 7, 17వ తేదీల్లో రెండు విడతలుగా జరగనున్న పోలింగ్‌కు కాంగ్రెస్ పార్టీ 83 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. అభ్యర్థిత్వం ఖరారైన 48 గంటల్లోగా సంబంధిత రాజకీయ పార్టీలు అభ్యర్థుల నేర చరిత్రను ఎన్నికల సంఘానికి అందజేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కాంగ్రెస్ పార్టీ పాటించలేదంటూ బీజేపీ శనివారం సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నేత జయప్రకాశ్ చంద్రవంశీ చెప్పారు. అభ్యర్థుల నేరచరిత్రను తమ వెబ్‌సైట్, రెండు వార్తా పత్రికలు లేదా సామాజిక మాధ్యమంలోనూ వెల్లడి చేయలేదన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినందున వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రతినిధి ధనుంజయ్ ఠాకూర్ స్పందించారు. నేర ప్రవృత్తి గల వారికి తాము టిక్కెట్లు ఇవ్వలేదని వివరించారు. నేరచరితులను కాపాడటం, వారిని ఎన్నికల బరిలోకి దించడం బీజేపీ అలవాటేనన్నారు.

క్లుప్తంగా...

పెన్షనర్లకు డీఆర్ విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు (పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు) డీయర్నెస్ రిలీఫ్ (డీఆర్)ను విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. పెన్షన్‌దారులు, కుటుంబ పెన్షన్‌దారులకు 01.07.2022 నుంచి అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా లవ్ అగర్వాల్

సాక్షి, అమరావతి: న్యూఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా లవ్ అగర్వాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ కేడర్‌కు చెందిన లవ్ అగర్వాల్ ఇప్పటివరకు డిప్యుటేషన్‌పై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. డిప్యుటేషన్ పూర్తయి కేంద్ర సర్వీసు నుంచి రాష్ట్ర కేడర్‌కు ఆయన తిరిగి రావడంతో ఏపీ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. దీంతో ప్రభుత్వ ప్రధాన సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌ను రెసిడెంట్ కమిషనర్ అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.

ఘనంగా శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ 8వ వార్షికోత్సవం



వార్షికోత్సవ కార్యక్రమంలో గల్లా రామచంద్రరావు, సంస్థ డైరెక్టర్లు

పాత గుంటూరు: నిర్మాణరంగంలో కొత్తదనం సృష్టించాలనే ఆశయంతో 2015లో ప్రారంభించిన శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎనిమిదో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గుంటూరులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శ్రీ భ్రమర బిజినెస్ అవార్డ్స్–2023 పేరుతో నిర్వహించిన ఈ వార్షికోత్సవంలో.. సంస్థ విజయాల్లో కీలకపాత్ర పోషించిన మార్కెటింగ్ టీమ్‌కు అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమర హౌసింగ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్ళా రామచంద్రరావు మాట్లాడుతూ 30కి పైగా ప్రాజెక్టులతో ఎనిమిదివేల మందికిపైగా సొంతింటి కల నెరవేర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, శైలారెడ్డి కోట, మురళీకృష్ణ యడ్లపల్లి, ఎం.పి.కె.లక్ష్మీపతిరాజు, ఎం.ఎస్.రాజు, సంస్థ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

గతం మర్చిపోతే ఎలా!?

ప్రజారోగ్యం మెరుగవుతుంటే ఎందుకంత కడుపుమంట రామోజీ?

సాక్షి, అమరావతి: ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు బుకాయించడంలో రామోజీ దిట్ట. అలా చేయకపోతే ఆయన కంటి మీద కునుకు పట్టదు. ఇలా బుకాయించడంలో ఆయన గిన్నీస్‌బుక్ రికార్డు కూడా ఇప్పటికే నెలకొల్పి ఉంటారు. ఎందుకంటే.. రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం ఆయన విషం కక్కడమే లక్ష్యంగా పెట్టుకున్నారు కాబట్టి. తాజాగా.. సీఎం జగన్ ప్రభుత్వంపై ఎప్పటిలాగే ఆయన మరో మారు తన కడుపుమంటను చాటుకున్నారు. గతంలో తన ఆత్మబంధువు చంద్రబాబు పాలన ఎంతో ఘనంగా ఉండేదని, ఇప్పుడే ఏమీ జరగడం లేదన్నట్లుగా 'మొహం చాటేసిన సీఎం' అంటూ ఈనాడులో ఆదివారం ఓ అబద్ధాల మాలికను అల్లారు. అప్పట్లో ప్రభుత్వాసుపత్రుల్లో అందే సేవలకూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అందుతున్న సేవలకూ మధ్య తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుండడంతో దిక్కుతోచని స్థితిలోనే తాజా కథనం రాసినట్లు దానిని చదివిన వారికి ఇట్టే అర్థమవుతుంది.



విప్లవాత్మక మార్పులపై విషం..

నిజానికి.. సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏకంగా 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తుండగా, అందులో ఐదు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరోవైపు.. పీహెచ్‌సీల నుంచి బోధనా సుపత్రుల వరకూ నాడు–నేడు కింద అభివృద్ధి పరచడంతోపాటు ఎక్కడా ఖాళీల్లేకుండా 53,126 సిబ్బందిని వైద్య, ఆరోగ్య శాఖలో కొత్తగా నియమించారు. గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఉద్దేశించిన విలేజ్ క్లినిక్ వ్యవస్థ, దేశంలోనే పలువురి ప్రశంసలు అందుకున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, కొత్త వైద్య కళాశాలలుం ఇలా ప్రజారోగ్య రంగంలో ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి విప్లవాత్మక మార్పు పైనా రాజగురువు వరుసగా తప్పుడు కథనాలు రాస్తున్నారు. తాజా కథనం కూడా ఈ కోవకు చెందినదే.

నిత్యం 2,204 వాహనాల పరుగులు..

గతంలో ఎన్నడూ లేనట్లుగా రాష్ట్రంలో '108' వాహనాలు 768 ఉన్నాయి. మొబైల్ మెడికల్ యూనిట్స్ (ఎంఎంయూ) '104'లు 936, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కింద 500 వాహనాలు నిత్యం పరుగులు పెడుతున్నాయి. ఇలా మొత్తం 2,204 వాహనాల ద్వారా వేగవంతమైన, ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదు. ఇది చూసి ప్రభుత్వానికి ప్రజల్లో ఎక్కడ మంచి పేరు వస్తుందోనని తొలి నుంచీ ఈ సేవలపై రామోజీ విషం కక్కుతూనే ఉన్నారు. ఆదివారం నాటి కథనంలోనూ ఆయన అలాగే తన అక్కసును వెళ్లగక్కారు.

నాడు దైన్యం.. నేడు ధైర్యం..

గత టీడీపీ ప్రభుత్వంలో 108, 104 సేవలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. అత్యవసర సమయంలో ఫోన్‌చేస్తే 108 అంబులెన్సు వస్తుందో రాదో తెలియని దుస్థితి. అయితే, అప్పట్లో సీఎం కుర్చీలో తమ బాబు ఉన్నాడు కాబట్టి రామోజీకి సహజంగా ఇవేమీ కనపడేవి కావు. టీడీపీ ప్రభుత్వంలో దైన్యంగా మారిన ఈ సేవలను సీఎం జగన్ పట్టాలెక్కించి ప్రజల్లో ధైర్యం నింపారు. మరోవైపు.. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేనాటికి 108 అంబులెన్సులు 531 ఉండగా వీటిలో 336 వాహనాలు అరకొరగా రోడ్లపై కనిపించేవి. అంటే.. అప్పట్లో 679 మండలాలు (ప్రస్తుతం 686) ఉంటే మండలానికి ఒక అంబులెన్స్ కూడా లేని పరిస్థితి. ఈ నేపథ్యంలో.. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించిన సీఎం జగన్ 2020 జూలై 1న 412 కొత్త 108 అంబులెన్సులను ప్రారంభించారు. 26 నియోనాటల్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కసారిగా ప్రభుత్వ అంబులెన్సుల సంఖ్య 748కు పెరిగింది. ఇందుకోసం మొత్తం రూ.96.5 కోట్లు ఖర్చుచేశారు. 2022 అక్టోబరులో అదనంగా మరో 20 అంబులెన్సులను (108 వాహనాలు) గిరిజన ప్రాంతాలకు కేటాయించారు. వీటి కోసం రూ.4.76 కోట్లు వెచ్చించారు. దీంతో 108 అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది. అంతేకాక.. ఈ ఏడాదే 2.5 లక్షల కిలో మీటర్లకుపైగా తిరిగిన పాత వాహనాలను తొలగించి వాటి స్థానంలో 146 కొత్త అంబులెన్సులను ప్రవేశపెట్టారు. వీటి కోసం రూ.34.79 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేసింది. ఈ లెక్కన 2020 నుంచి ఇప్పటివరకు కొత్త అంబులెన్సుల కొనుగోలుకు రూ.135.05 కోట్లు ఖర్చుచేసినట్లయింది.

'108'ల కోసం ఏటా రూ.188 కోట్ల ఖర్చు

ఇక ఈ అంబులెన్స్ల నిర్వహణ కోసం నెలకు రూ.14.39 కోట్లు చొప్పున ఏడాదికి రూ.172.68 కోట్లు కేవలం 108 అంబులెన్సుల నిర్వహణ కోసం కేటాయిస్తోంది. వీటికి తోడు ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ కోసం ఏడాదికి రూ.15.88 కోట్లు వెచ్చిస్తోంది. అంటే మొత్తంగా ఒక ఏడాదిలో 108 వాహనాలు కోసం చేస్తున్న ఖర్చు రూ.188.56 కోట్లు. ఇదంతా పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో భాగంగానే జరుగుతోంది. ఇంత చిత్తశుద్ధితో 108 సేవలు అమలుచేస్తుంటే రామోజీరావు బురద జల్లే రాతలు రాయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అర్బన్ ప్రాంతాల్లో నిర్దేశించుకున్న 15 నిమిషాలు, రూరల్ ప్రాంతాల్లో నిర్దేశించుకున్న 20 నిమిషాల్లోపే 108 అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకుని ఆపన్న హస్తం అందిస్తున్నాయి. ఇదీ 108 సేవల సమర్థతకు నిదర్శనం.

'తల్లీబిడ్డ' సేవల్లోనూ ఎంతో మార్పు

- గతంలో కేవలం 279 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ఉంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వాటి సంఖ్య 500కు పెరిగింది.
- అప్పట్లో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ పేరిట ఓమ్నీ వాహనాలను వినియోగించేవారు. ఒక్కో దానిలో ఇద్దరు గర్భిణులను తరలించేవారు. ఏసీ సదుపాయం కూడా లేదు.
- కానీ, ప్రస్తుత ప్రభుత్వంలో విశాలమైన ఎకో మోడల్ ఏసీ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో దాంట్లో ఒకరిని మాత్రమే తరలిస్తున్నారు.
- గత ప్రభుత్వ హయాంలో ఒక ట్రిప్పునకు కేవలం రూ.499లు మాత్రమే ఖర్చుచేయగా.. ఈ ప్రభుత్వం రూ.895లు వెచ్చిస్తోంది.

సొంత ఊర్లలోనే '104' సేవలు..

ఇక సీఎం జగన్ ప్రభుత్వంలో 104 సర్వీసుల స్వరూపానికి పూర్తిగా మార్పులు చేశారు. జూలై 2020లో 656 ఎంఎంయూ (104)లను సీఎం జగన్ ప్రారంభించారు. ఇందుకు రూ.108 కోట్లు ఖర్చు చేశారు. రూ.4 కోట్లతో మరో 20 వాహనాలను గిరిజన ప్రాంతాల్లో సేవల కోసం కొనుగోలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10,032 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలుచేయడానికి వీలుగా అదనంగా 260 (104) వాహనాలను ప్రవేశపెట్టారు. వీటికోసం రూ.58 కోట్లు వెచ్చించారు. ఈ మొత్తం 936 మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా కోట్లాది మంది ప్రజలు తమ సొంత ఊర్లలోనే వైద్యసేవలు పొందారు.

ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నా..

108, 104 సిబ్బందికి ఒప్పందం ప్రకారం సర్వీస్ ప్రొవైడర్ నుంచి వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిని కూడా రామోజీ తట్టుకోలేకపోతున్నారు. గత సంవత్సరం ఉద్యోగులకు నిర్దేశించిన బేసిక్ పే పై 8 శాతం ఇంక్రిమెంట్‌తో జీతాలు పెంచేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా ఈ ఏడాది కూడా ఇంక్రిమెంట్ ఇచ్చి, ఆ ఇంక్రిమెంట్ ఎరియర్స్‌ను చెల్లించేలా ఆదేశాలిచ్చారు. ఉద్యోగులకు ప్రతినెలా జీతాలను జమచేయడంలో ఎప్పుడన్నా జాప్యం జరిగినా వెంటనే వేతనాలు అందేలా చర్యలు ఉంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరాన్ని పరిశీలిస్తే సెప్టెంబరు వరకూ వేతనాలు పూర్తిగా చెల్లించారు. అయినా జీతాలు ఇవ్వలేదని ఈనాడు పెడబొబ్బలు పెడుతోంది. అలాగే, అక్టోబరు నెల వేతనం నవంబరులో ఇస్తారు. ఇవన్నీ ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా రామోజీ రోత రాతలు లేనిపోని సమస్యలను సృష్టించేందుకు తప్ప మరొకటి కాదు.

పత్తి రైతుకు 'ధర'హాసం

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయిస్తోంది.

12.85 లక్షల టన్నుల దిగుబడులు

రాష్ట్రంలో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 14.13 లక్షల ఎకరాలు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 13.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవగా.. 12.85 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా. ఇటీవలే కనీస మద్దతు ధరలను ప్రభుత్వం ప్రకటించింది. ఏటా క్వింటాల్‌కు రూ.200 నుంచి రూ.300 వరకు పెంచుతుండగా, తొలిసారి ఏకంగా రూ.640 మేర పెంచింది. పొడుగు పింజ రకానికి క్వింటాల్‌కు రూ.7,020, మీడియం రకానికి రూ.6,620 చొప్పున కనీస మద్దతు ధర నిర్ణయించింది. ప్రస్తుతం ఆదోని మార్కెట్‌కు రోజుకు 3 నుంచి 5 వేల క్వింటాళ్ల పత్తి వస్తుండగా.. క్వింటాల్‌కు రూ.7 వేల నుంచి రూ.7,400 వరకు పలుకుతోంది.

అప్రమత్తమైన ప్రభుత్వం

కనీస మద్దతు ధరకు కాస్త అటూ ఇటుగా మార్కెట్ ధరలు ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసింది. 34 ఏఎంసీలతో పాటు 50 జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా క్వింటాల్‌కు రూ.13 వేల వరకు ధర లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

నిబంధనలు ఇవీ

తేమ 8 లేదా అంతకంటే తక్కువ శాతం ఉండాలి. 8 శాతం కంటే పెరిగిన ప్రతి ఒక్క శాతం తేమకు ఒక శాతం చొప్పున మద్దతు ధరలో రూ.70.20 చొప్పున తగ్గిస్తారు. 12 శాతానికి మించి తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయరు. పత్తి పింజ పొడవు 29.50 ఎంఎం నుంచి 30.50 ఎంఎం వరకు ఉండవచ్చు. మైక్రో నైర్ విలువ నిర్ణీత పరిధి కంటే తక్కువ లేదా ఎక్కువ ఉంటే ప్రతి 0.2 విలువకు క్వింటాల్‌కు రూ.25 తగ్గిస్తారు. పత్తిలో దుమ్ము, ధూళి, చెత్తా, చెదారం లేకుండా చూసుకోవాలి. గుడ్డు పత్తికాయలు, రంగుమారిన, పురుగు పట్టిన కాయలను వేరు చేసి శుభ్రమైన పత్తిని మాత్రమే తీసుకురావాలి. నీళ్లు జల్లిన పత్తిని కొనుగోలు చేయరు. కొడు పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తిలో కలపరాదు. గోనె సంచుల్లో కానీ లేదా లూజు రూపంలో మాత్రమే తీసుకు రావాలి. ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొస్తే కొనుగోలుకు అనుమతించరు.



ఆదోని మార్కెట్ యార్డ్ లో పత్తి నిల్వలు

ఆర్బీకేల్లో నమోదుకు శ్రీకారం

ఈ–పంట నమోదు ఆధారంగా సీఎం యాప్ ద్వారా వాస్తవ సాగుదారుల నుంచి నేరుగా పత్తి కొనుగోలు చేయనున్నారు. రైతులు తమ సమీపంలోని ఆర్బీకే కేంద్రంలో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాల నకలుతో పేరు నమోదు చేసుకొని టోకెన్ తీసుకోవాలి. ఆ టోకెన్‌లో పేర్కొన్న తేదీన పత్తిని నిర్దేశించిన యార్డు లేదా జిన్నింగ్ మిల్లుకు తీసుకెళితే.. నిర్దేశిత గడువులోగా రైతు ఖాతాలకు నగదు జమ చేస్తారు.

తొందరపడి అమ్ముకోవద్దు

మార్కెట్‌లో ధరలు ఎమ్మెస్పీకి కాస్త అటూ ఇటుగా ఉండడంతో ముందుజాగ్రత్త చర్యగా ఈ నెల 25 నుంచి కొనుగోలు కేంద్రాలు తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పంట నమోదు ప్రామాణికంగా ఆర్బీకేల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు కొనుగోలు చేస్తాం. ధరలు పెరిగే అవకాశం ఉన్నందున తొందరపడి రైతులెవరూ అమ్ముకోవద్దని చెబుతున్నాం. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మంచి ధరలు వచ్చే అవకాశాలున్నాయి.

– రాహుల్ పాండే, కమిషనర్, మార్కెటింగ్ శాఖ

'గైస్'కు ఐఎస్‌వో గుర్తింపు

రాష్ట్రంలో ఐఎస్‌వో సర్టిఫికెట్ పొందిన పాలిటెక్నిక్ కాలేజీగా గుర్తింపు

మురళీనగర్ (విశాఖ ఉత్తర): విశాఖలోని కంచరపాలెంలో ఉన్న గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ (గైస్) కాలేజీ మరో ఘనత సాధించింది. రాష్ట్రస్థాయిలో అత్యధిక ఉద్యోగాలు సాధించిన కాలేజీగా ఇటీవల అవార్డు పొందిన ఈ కళాశాల అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సౌకర్యాలు, విద్యా విధానాన్ని అమలు జరుపుతున్నట్లు ఐఎస్‌వో గుర్తించింది. దీనిపై గతంలో కాలేజీని ఐఎస్‌వో బృందం సందర్శించి విద్యా ప్రమాణాలు, ఉద్యోగాల సాధన, సిబ్బంది పనితీరు, మౌలిక సదుపాయాలను పరిశీలించింది. టీయూవీ ఎస్‌యూడీ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన సర్టిఫికేషన్ బాడీ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని, క్షేత్రపరిశీలన చేసి గైస్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్ మంజూరు చేసింది. ఈ మేరకు 'గైస్'కు ఐఎస్‌వో 21001:2018 సర్టిఫికెట్‌ను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు ఆన్‌లైన్‌లో పంపించింది. 19 అక్టోబరు 2026 వరకు ఈ సర్టిఫికెట్ చెల్లుతుంది. రాష్ట్రంలోనే ఐఎస్‌వో సర్టిఫికెట్ పొందిన తొలి పాలిటెక్నిక్ కాలేజీగా 'గైస్' గుర్తింపు పొందింది.

ఔననదు.. కాదనదు!

- పోలవరం నావిగేషన్ కెనాల్ నిధులపై ఐడబ్ల్యూఏఐ మౌనం
- తొలుత సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ మేరకు 90% పనులు పూర్తి
- 2016లో భద్రాచలం–ధవళేశ్వరంను జాతీయ జల మార్గం–4గా ప్రకటించిన ఐడబ్ల్యూఏఐ
- క్లాస్–3 ప్రమాణాల మేరకు నావిగేషన్ కెనాల్ నిర్మించాలని నిర్దేశం.. ఇందుకు రూ.876 కోట్లు అవసరమన్న రాష్ట్ర అధికారులు
- ఈ వ్యయాన్ని ఐడబ్ల్యూఏఐ భరించాలని కేంద్ర జల్ శక్తి శాఖ స్పష్టీకరణ.. అయినా నిధుల మంజూరుపై స్పందించని ఐడబ్ల్యూఏఐ



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నావిగేషన్ కెనాల్‌ను జాతీయ జలమార్గం క్లాస్–3 ప్రమాణాల మేరకు నిర్మించాలని సూచించిన ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐడబ్ల్యూఏఐ).. ఆ పనులకయ్యే నిధులపై మాత్రం స్పందించడం లేదు. ఇప్పటికే పోలవరం స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి.. వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వం ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్‌పై దృష్టి పెట్టింది. జలాశయం పూర్తయితే నావిగేషన్ కెనాల్, టన్నెల్ నిర్మాణం చేపట్టడం అతి పెద్ద సవాల్‌గా మారుతుంది. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కేంద్ర నౌకాయాన శాఖ, ఐడబ్ల్యూఏఐ దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఆ రెండు సంస్థలు మాత్రం నిధుల మంజూరుపై స్పష్టత ఇవ్వట్లేదు.

90 శాతం పనులు పూర్తి..

వాస్తవానికి పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను 2004–05లోనే కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఆమోదించిన డిజైన్ మేరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందులో పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరిపై ఎగువకు, దిగువకు నౌకయానానికి వీలుగా 36.6 మీటర్ల వెడల్పు.. 9.6 మీటర్ల పూర్తి ప్రవాహ లోతు(ఎఫ్‌ఎస్‌డీ)తో 1.423 కి.మీ.ల పొడవుతో అప్రోచ్ ఛానల్.. దానికి కొనసాగింపుగా 40 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల ఎత్తు గేటుతో మూడు నావిగేషన్ లాక్‌లు, 12 మీటర్ల వెడల్పు, 3.81 మీటర్ల ఎఫ్‌ఎస్‌డీతో 3.84 కి.మీ.ల పొడవున నావిగేషన్ కెనాల్.. 12 మీటర్ల వెడల్పు, 3.66 మీటర్ల ఎఫ్‌ఎస్‌డీ, 2.34 మీటర్ల నిలువుతో 890 మీటర్ల పొడవున నావిగేషన్ టన్నెల్ పనులను చేపట్టింది. ఇందులో 2014 నాటికే నావిగేషన్ లాక్‌ల పనులను దాదాపుగా పూర్తిచేసింది. నావిగేషన్ టన్నెల్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. అలాగే.. 2013–14 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ టీఏసీ ఆమోదించిన వ్యయం మేరకు నావిగేషన్ కెనాల్ పనుల అంచనా వ్యయం రూ.261.62 కోట్లు. ఇందులో రూ.137.93 కోట్ల విలువైన పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది.

జాతీయ జల మార్గంలో స్థానం..

ధవళేశ్వరం–భద్రచాలం స్ట్రెచ్(అఖండ గోదావరి)ను జాతీయ జలమార్గం–4లో అంతర్భాగంగా 2016లో ఐడబ్ల్యూఏఐ ప్రకటించింది. ఈ జల మార్గాన్ని క్లాస్–3 ప్రమాణాలతో చేపట్టాలని నిర్ణయించింది. క్లాస్–3 ప్రమాణాలతో పోలవరం నావిగేషన్ కెనాల్‌ను నిర్మించాలంటే.. 1.423 కి.మీ.ల పొడవున అప్రోచ్ ఛానల్‌ను 40 మీటర్ల వెడల్పు, 2.20 ఎఫ్‌ఎస్‌డీతోనూ.. దానికి కొనసాగింపుగా 70 మీటర్ల వెడల్పు, 15 మీటర్ల ఎత్తు గేటుతో 3 నావిగేషన్ లాక్‌లు, 40 మీటర్ల వెడల్పు, 2.20 మీటర్ల ఎఫ్‌ఎస్‌డీతో 3.84 కి.మీ.ల పొడవున నావిగేషన్ కెనాల్.. 20 మీటర్ల వెడల్పు, 2.20 మీటర్ల ఎఫ్‌ఎస్‌డీ, 7 మీటర్ల నిలువుతో 890 మీటర్ల పొడవున నావిగేషన్ టన్నెల్ పనులను చేపట్టాలి. ఈ పనులకు రూ.876.38 కోట్ల వ్యయమవుతుంది.

ఉలుకూపలుకు లేని ఐడబ్ల్యూఏఐ..

నిధులిస్తే పనులు చేపడతామని ఐడబ్ల్యూఏఐకి అనేకసార్లు రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు ప్రతిపాదించారు. ఈ వ్యయాన్ని ఐడబ్ల్యూఏఐ భరించాలని సీడబ్ల్యూసీ, కేంద్ర జల్ శక్తి శాఖలు కూడా స్పష్టం చేశాయి. ఐడబ్ల్యూఏఐ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర నౌకాయాన శాఖ, సీడబ్ల్యూసీ, రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి సమావేశాలు నిర్వహించి.. నిధులు మంజూరు చేయాలని ఐడబ్ల్యూఏఐకి తేల్చిచెప్పారు. అయినా కూడా ప్రతి సమావేశంలోనూ జాతీయ ప్రమాణాల మేరకు పోలవరం నావిగేషన్ కెనాల్ పనులు చేయాలని ఐడబ్ల్యూఏఐ ఉన్నతాధికారులు నిర్దేశిస్తారేగానీ.. నిధులిచ్చే అంశాన్ని మాత్రం ఎటూ తేల్చడం లేదు.

విహారం... విషాదం

- సముద్రంలోకి కొట్టుకెళ్లిన కుటుంబం
- ఇద్దరి మృతి, ఒకరి గల్లంతు, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- బాధితులంతా తణుకువాసులే



సావిత్రి, రఘువర్మ మృతదేహాలు

నరసాపురం: సరదాగా సముద్రస్నానానికి వెళ్లిన ఓ కుటుంబం మృత్యుకోరల్లో చిక్కుకుంది. వారిలో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గల్లంతయ్యారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్సకోసం భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరంతా తణుకు పట్టణానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా గుర్తించారు. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, పేరుపాలెం బీచ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. తణుకు పట్టణానికి చెందిన రెండు కుటుంబాలకు చెందిన మొత్తం 10మంది ఆదివారం రెండు ఆటోల్లో మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కు చేరుకున్నారు. వారంతా సముద్రంలో స్నానం చేస్తూ ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అనుపోజు రఘువర్మ (26), గొరసా సావిత్రి (35), అనుపోజు రవికుమార్ (17), అనుపోజు శ్రావణి (16), గొరసా తన్మయి (15) సముద్రంలో స్నానం చేస్తుండగా, ఒక పెద్ద అల రావడంతో వారంతా లోపలికి కొట్టుకుపోయారు. దీన్ని గమనించిన స్థానికులు, మత్స్యకారులు వెంటనే స్పందించి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. ముందుగా శ్రావణి, తన్మయిలను, రెండో ప్రయత్నంలో రఘువర్మ, సావిత్రిలను బయటకు తీసుకొచ్చారు. అయితే సావిత్రి ఒడ్డుకు చేరేటప్పటికే ప్రాణాలు కోల్పోయింది. రఘువర్మ నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చేసరికి మృతి చెందాడు. మరో యువకుడు అనుపోజు రవికుమార్ ఆచూకీ లభించలేదు. అతని జాడ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని మొగల్తూరు ఎస్‌ఐ వీరబాబు చెప్పారు.

గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంక వద్ద గౌతమి గోదావరిలో శనివారం గల్లంతైన నలుగురు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన ఏడుగురు యువకులు పుట్టిన రోజు వేడుకకు యానాం రావడం, వారిలో గోపులంక వద్ద గోదావరిలో నలుగురు గల్లంతవడం తెలిసిందే. వీరిలో హనుమకొండ కార్తీక్, ముద్దన ఫణీంద్ర గణేష్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. చేతికి అందివచ్చే సమయంలో ఆ యువకులు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యువకుల మృతదేహాలను వెలికితీయడంలో కొవ్వూరు ఫైర్‌స్టేషన్ స్కూబా డైవింగ్ నిపుణుడు ఆక్సిజన్ సాయంతో సుమారు 70 అడుగుల లోతులో మూడు గంటల పాటు శ్రమించి, కార్తీక్, రవితేజ మృతదేహాల ఆచూకీ కనుగొన్నారు.

తెలంగాణ

రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

ఉత్తర్వులు జారీ చేసిన బీజేపీ కేంద్ర క్రమశిక్షణా కమిటీ

సాక్షి, న్యూఢిల్లీ/ అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌కు ఊరట లభించింది. రాజాసింగ్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఆదివారం బీజేపీ అధిష్టానం ఎత్తివేసింది. గతేడాది ఆగస్టులో కమెడియన్ మునావర్ ఫరూకీ హైదరాబాద్‌లో షో నిర్వహించిన సమయంలో రాజాసింగ్ విడుదల చేసిన ఓ వీడియో వైరల్ కావడంతో పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో రాజాసింగ్‌కు బీజేపీ షోకాజ్ నోటీసు ఇచ్చి.. ఆ తర్వాత సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. అయితే పార్టీ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు రాజాసింగ్ ఇచ్చిన వివరణపై సమీక్ష జరిపిన కేంద్ర క్రమశిక్షణా కమిటీ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆదివారం బీజేపీ కేంద్ర క్రమశిక్షణా కమిటీ సభ్య కార్యదర్శి ఓం పాఠక్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా బీజేపీ మొదటి జాబితాలో మరోసారి గోషామహల్ నుంచి రాజాసింగ్‌కు అసెంబ్లీ టికెట్ కూడా కేటాయించింది. దీంతో ధూల్‌పేట్ నుంచి రాజాసింగ్‌తో పాటు కార్యకర్తలు, నాయకులు కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయానికి భారీ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

త్రిపుర గవర్నర్‌గా 26న ఇంద్రసేనారెడ్డి ప్రమాణం

- త్రిపుర గవర్నర్ ఏడీసీ మేజర్ రోహిత్ సేథీ రాక
- గవర్నర్ నియామకపు ఉత్తర్వుల అందజేత



సాక్షి, హైదరాబాద్: త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గవర్నర్ నియామకానికి సంబంధించి రాష్ట్రపతి వెలువరించిన ఉత్తర్వులను (వారెంట్) త్రిపుర గవర్నర్ ఏడీసీ మేజర్ రోహిత్ సేథీ ఇంద్రసేనారెడ్డికి అందజేశారు. త్రిపుర రాష్ట్రానికి సంబంధించిన భౌగోళిక, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని కూడా అందజేశారు. ఇంద్రసేనారెడ్డి ఈ నెల 25వ తేదీ ఉదయమే హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు. ఇంద్రసేనారెడ్డిని తోడ్కొని వెళ్లేందుకు ఈ నెల 24న త్రిపుర రాజ్‌భవన్ పేషీ సిబ్బంది హైదరాబాద్ చేరుకుంటారని సమాచారం.

ప్రొద్దుటూరులో 300 కిలోల బంగారం సీజ్

- పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు
- రెండు వాహనాల్లో బంగారం, డాక్యుమెంట్ల తరలింపు
- నాలుగు రోజులపాటు నాలుగు బంగారు దుకాణాల్లో తనిఖీలు



బంగారు దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను తరలిస్తున్న ఐటీశాఖ సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: బంగారం వ్యాపారానికి ప్రసిద్ధిగాంచిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఐటీ అధికారులు సోదాలు జరిపి సుమారు 300 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. బంగారు నగలతో పాటు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని రెండు వాహనాల్లో తిరుపతికి తరలించారు. ప్రొద్దుటూరులోని నాలుగు బంగారం దుకాణాల్లో ఈ నెల 19 నుంచి ఆదాయపన్నుశాఖ అధికారులు జరిపిన తనిఖీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. అధికారులు బంగారం దుకాణాలతో పాటు యజమానులు, వారి బంధువుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఒక దుకాణంలో సుమారు 200 కిలోలు, మరో రెండు దుకాణాల్లో 100 కిలోల వరకు లెక్కలు చూపని బంగారం లభించడంతో దాన్ని సీజ్ చేశారు. కాగా ఐటీ అధికారులు ఈ వివరాలను అధికారికంగా ధ్రువీకరించలేదు.

పండుగ సమయంలో స్తంభించిన వ్యాపారం

కొనుగోలుదారులకు బిల్లులు ఇవ్వకుండా బంగారు నగలు విక్రయించడంతో పాటు అక్రమంగా బంగారం దిగుమతి చేసుకుంటున్నారని ఫిర్యాదులు వెళ్లటంతో ప్రొద్దుటూరులోని నాలుగు బంగారం దుకాణాల్లో ఈ నెల 19న సుమారు 40 మంది ఇన్‌కం ట్యాక్స్ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పెద్దమొత్తంలో లెక్కలు లేని బంగారం లభించడంతో పట్టణంలోని బంగారం దుకాణాల్లో జీరో వ్యాపారం జరుగుతోందన్న విషయం బయటపడిందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలా సుదీర్ఘంగా సోదాలు జరగలేదని వ్యాపారులు పేర్కొన్నారు. వేలాది బంగారం దుకాణాలున్న ప్రొద్దుటూరులో ఐటీ అధికారుల దాడుల నేపథ్యంలో ఒక్కసారిగా వ్యాపారాలు స్తంభించిపోయాయి. తనిఖీలు తమవరకు ఎక్కడ వస్తాయో అనే భయంతో వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. పండుగ నేపథ్యంలో బంగారం కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలు దుకాణాలు మూసివేయడంతో నిరాశ చెందారు.

ఎన్‌ఐఏ పేరిట ఐఎస్ దుష్ప్రచారం..

దేశ వ్యతిరేక భావజాలం ఉన్న ముస్లింల సమాచారం ఇవ్వాలంటూ ఫేక్ ఫోన్ నెంబర్లు

సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే, లవ్‌జిహాదీలకు ప్రేరేపించే, సోషల్ మీడియాలో ముస్లింలు పెట్టే అభ్యంతరకరమైన మెసేజ్‌లపై సమాచారం ఇవ్వాలంటూ సోషల్ మీడియాలో ఎన్‌ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) పేరిట ఓ తప్పుడు సమాచారం సర్క్యులేట్ అవుతున్నట్టు ఎన్‌ఐఏ అధికారులు పేర్కొన్నారు. దేశ వ్యతిరేక భావజాలం ఉన్న ముస్లింల సమాచారం ఇవ్వాలంటూ ఫేక్ ఫోన్ నంబర్లతో ఎన్‌ఐఏ పేరిట ప్రచారం చేస్తున్నట్టు ఎన్‌ఐఏ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఓ వర్గాన్ని ఎన్‌ఐఏ టార్గెట్‌గా చేసుకున్నట్టు కొన్ని తప్పుడు సందేశాలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారం అవుతున్నాయని వెల్లడించింది. నకిలీ ఫోన్ నంబర్లను జత చేసిన ఈ సందేశాలతో ఎన్‌ఐఏకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఎన్‌ఐఏ అధికారులు దీనిపై ఆరా తీయగా..ఈ తరహా సందేశాలతో ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్) మోసపూరితంగా భారతీయ యువకులను లక్ష్యంగా చేసుకుంటున్నట్టు తేలిందని పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ, తప్పుడు సందేశాలను నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని లేదా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలను ఎన్‌ఐఏ అధికారులు కోరారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
23-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
232	82
65,398	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	12,984	▽ 202
డోజోన్స్	33,127	▽ 287
ఎఫ్‌టీఎస్ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
షాంఘై	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎంతం	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	ఎంతం	99.44	102.75
€	యూరో	ఎంతం	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	ఎంతం	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎంతం	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	ఎంతం	59.70	61.63
SAR	సౌదీ రియాల్		21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్		21.73	23.53
¥	చైనా యువాన్		10.24	12.31

పాత బంగారం మార్చుకుంటున్నారా?

పండుగలు అంటే కేవలం ఖర్చు చేయడమే కాదు.. భవిష్యత్‌కు 'బంగారు'బాట వేసుకోవడం కూడా. నచ్చిన గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు కొనే వారు, అందులో కొంత ఆదా చేసి భవిష్యత్ కోసం ఎందుకు ఇన్వెస్ట్ చేసుకోకూడదు? ఇలా ఆలోచించే కొందరు పండుగ సమయాల్లో బంగారం కొనుగోలు చేస్తుంటారు. బంగారం కేవలం అందాన్ని పెంచే ఆభరణం మాత్రమే కాదు, విలువను పెంచే ఆస్తి. అస్థిరతల్లో ర్యాలీ చేసే పెట్టుబడి సాధనం. కనుక పండుగ సమయాల్లో విలువ తరిగిపోయే వాటి కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టేవారు.. పసిడికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన.



- ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా?
- రెండింటికీ ఒక్కటే విధానం అనుకూలం కాదు
- అవసరమైతేనే కొత్త ఆభరణంతో మార్పిడి
- ఈ సమయంలో తయారీ, పన్నుల రూపంలో నష్టం
- పెట్టుబడి దృష్ట్యా మెరుగైన ప్రత్యామ్నాయాలు

గడిచిన కొన్నేళ్లలో బంగారం కొనుగోలు ఎన్నో మార్పులను సంతరించుకుంది. 20 ఏళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టే వారు అరుదుగా కనిపించే వారు. తర్వాత కాలంలో ఇందులో స్పష్టమైన మార్పు కనిపించింది. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా అర్థం చేసుకోవడం పెరిగింది. గతంలో బంగారంపై పెట్టుబడి అంతా భౌతిక రూపంలోనే ఉండేది. ఇప్పుడు సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, ఇప్పటికీ పెట్టుబడి దృష్ట్యా భౌతిక బంగారానికే ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ధంతేరస్ (ధనత్రయోదశి) వంటి ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు నమోదవుతుంటాయి. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యే ఆస్తుల్లో బంగారానికి మొదటి స్థానం ఉంటుంది. నేటితరం పాత బంగారాన్ని, కొత్త ఆభరణాలతో మార్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిజానికి పాత బంగారం మార్పిడితో కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం సరైనదా..? ఆభరణాలను పెట్టుబడిగా చూడొచ్చా? పెట్టుబడి కోసం ఏ రూపంలో ఇన్వెస్ట్ చేయడం మెరుగు? ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలను ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

బంగారం మార్పిడి విధానం..?

పాత బంగారు ఆభరణాలను మార్చుకోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. మార్కెట్లోకి వచ్చే కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి ఏర్పడొచ్చు. పాత నగలు డ్యామేజ్ కావొచ్చు. లేదంటే కొత్త ఆభరణాలు కొనుగోలు చేసుకోవడానికి బడ్జెట్ లేక పాత వాటిని మార్చుకోవచ్చు. కారణం ఏదైనా.. పాత బంగారం మార్చుకునే క్రమంలో కొంత నష్టపోతున్నామనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. పాత బంగారం ఆభరణాల మార్పిడికి సంబంధించి మన దేశంలో ప్రామాణిక విధానం అంటూ లేదు. వర్తకుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఆభరణం కొనుగోలు చేసిన వర్తకుడి వద్దే దాన్ని మార్చుకోవడం వల్ల గరిష్ట విలువను తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది. హాల్‌మార్క్ ఆభరణాలు అయితే బంగారం మార్కెట్ ధర మేర విలువను పొందొచ్చు. అయినా కానీ, ఆభరణాల తరుగు-తయారీ చార్జీలు అధికంగా ఉంటున్నాయి. బంగారం ధరలో 10-20 శాతం వరకు తరుగు, తయారీ చార్జీలను జ్యుయలరీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పాత ఆభరణాన్ని మార్చుకున్నప్పుడు అందులో తరుగు-తయారీ రూపంలో కొంత నష్టం ఏర్పడుతుంది. తిరిగి నూతన ఆభరణం కొనుగోలు చేయడం వల్ల, దాని తరుగు-తయారీ చార్జీల రూపంలో అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది.

కొనుగోలు చేసిన వర్తకుడి నుంచి కాకుండా, వేరొక చోట పాత ఆభరణాన్ని మార్చుకునేట్టు అయితే ప్రక్రియ వేరుగా ఉంటుంది. వర్తకులు కొందరు కొన్ని అంశాల్లో ఏకరూప విధానాన్ని అనుసరిస్తుంటే, కొన్నింటి విషయాల్లో సొంత ప్రక్రియలను అమలు చేస్తున్నారు. పాత బంగారం ఆభరణాన్ని కరిగించి, స్వచ్ఛత చూసిన తర్వాత, కొత్త ఆభరణంతో మార్చుకోవడానికి చాలా సంస్థలు అనుమతిస్తున్నాయి. ''డిజిటల్ స్కేల్ సాయంతో బంగారం ఆభరణం బరువు చూస్తారు. దీని ఆధారంగా స్వచ్ఛతను బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అనుసరించే స్వచ్ఛతలు 24 క్యారట్ (99.9 శాతం స్వచ్ఛత), 22 క్యారట్ (91.6 శాతం స్వచ్ఛత), 18 క్యారట్ (75 శాతం స్వచ్ఛత). కొందరు జ్యుయలర్లు స్క్రాచ్ (గీయడం), యాసిడ్ టెస్ట్ ద్వారా బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంటారు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్ హరీశ్.వి తెలిపారు. అన్నింటికంటే ప్రామాణికమైనది హాల్‌మార్క్ స్వచ్ఛత విధానం. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ సేవలు అందిస్తోందని, హాల్‌మార్క్ గోల్డ్ స్వచ్ఛత పరంగా విశ్వసనీయమైనదిగా హరీశ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద సంస్థలు అయితే క్యారట్‌ను కొలిచే మెషీన్లను ఉపయోగిస్తున్నాయి. వీటినే గోల్డ్ అనలైజర్ మెషీన్లు అంటున్నారు. అందులో బంగారం లేదా ఆభరణాన్ని ఉంచితే బరువు ఎంత, ప్యూరిటీ ఎంత అనే వివరాలను ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు వడోదరకు చెందిన రీనా దంపతులు ఎదుర్కొన్న అనుభవాన్ని తెలుసుకుంటే పాత బంగారం మార్పిడి ఇప్పుడు ఎంత సులభంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరివద్దనున్న 20 గ్రాముల బంగారం చైన్ తెగిపోగా, 2014లో మార్చుకుందామని అనుకున్నారు. ఓ జ్యుయలర్ వద్దకు వెళితే, కంటితో చూసి 18 క్యారట్ల బంగారం అని ఖరారు చేసి, రూ.37,500 ధర చెల్లిస్తానని చెప్పాడు. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.25,000 స్థాయిలో ఉంది. దీంతో వారు మార్చుకోలేదు. ఇటీవలే అదే చైన్‌ను ఓ వర్తకుడి వద్దకు తీసుకెళ్లగా, గోల్డ్ అనలైజర్ మెషీన్‌లో పెట్టి చూశారు. 22 క్యారెట్ల ప్యూరిటీ ఉన్నట్టు చూపించింది. దాన్ని కరిగించిన తర్వాత అసలు విలువ చెబుతానని అనడంతో, అందుకు రీనా దంపతులు ఒప్పుకున్నారు. కరిగించిన తర్వాత కూడా 22.1 క్యారెట్ నిర్ధారణ అయింది. దాంతో 10 గ్రాములకు రూ.61,000 చొప్పున విలువ కట్టారు. కొత్త ఆభరణం ధర కూడా అదే రీతిలో ఉండడంతో వారు మార్చుకునేందుకు సమ్మతించారు.

కొత్త ఆభరణాల కొనుగోలు

బంగారం కూడా ఒక ఆస్తే. ఎవరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకైనా ఇది విలువను పెంచుతుంది. ఆభరణం కోసం కొంటున్నారా? లేక పెట్టుబడి దృష్ట్యా కొంటున్నారా? అన్న స్పష్టత అవసరం. భౌతిక బంగారం, ఆభరణాల రూపంలో ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే తరుగు-తయారీ చార్జీలు, దానిపై జీఎస్‌టీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. స్వచ్ఛతకు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. నేడు చాలా జ్యుయలరీ సంస్థలు తమ వద్దే విక్రయిస్తే 100 శాతం విలువను చెల్లిస్తున్నాయి. ఒకవేళ ఆభరణంతో మార్చుకోకుండా, నగదు కోరితే మొత్తం విలువలో 5 శాతం వరకు తగ్గించి ఇస్తున్నాయి. పన్ను కోణంలో ఇలా చేస్తున్నాయి. ''జ్యుయలరీ అనేది సెంటిమెంటల్. మనోభావాలతో ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకో తరానికి బదిలీ అవుతుంటుంది. అయితే అధిక తరుగు-తయారీ చార్జీల (10-20 శాతం)తో మార్చుకునేందుకు అయ్యే వ్యయం ఎక్కువ. దీనికితోడు జ్యుయలరీ కోసం స్టోరేజ్, లాకర్ చార్జీలను కూడా చెల్లించుకోవాల్సి రావచ్చు. భౌతిక బంగారం అయినా, ఆభరణాలు అయినా అవి వ్యక్తిగత ఆస్తులు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువకు తోడు కావు. పెట్టుబడి కోసం అయితే బంగారం కడ్డీలు లేదా కాయిన్లను కొనుగోలు చేయడం కాస్త మెరుగైనది'' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దిల్షద్ బిల్లిమోరియా సూచించారు. అయితే బంగారం కాయిన్లు, కడ్డీలను తిరిగి విక్రయించే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అంటున్నారు. ''బ్యాంక్‌లు కాయిన్లు, కడ్డీలను విక్రయించడమే కానీ, వెనక్కి తీసుకోవడం లేదు. దీంతో వీటిని బయట విక్రయించుకోవాల్సి వస్తుంది. తరుగు, కరిగించేందుకు చార్జీలను ఆ సమయంలో వసూలు చేస్తున్నారు''అని బిల్లిమోరియా వివరించారు.

ఏమిటి మార్గం..?

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే చక్కని హెడ్జింగ్ సాధనం బంగారం అని నిపుణులు చెబుతున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎవరి పోర్ట్‌ఫోలియోలో అయినా వైవిధ్యం ఏర్పడుతుందని అంటున్నారు. కాకపోతే పెట్టుబడి దృష్ట్యా అయితే ఆభరణాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను పరిశీలించాలన్నది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎస్‌జీబీలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ''చారిత్రకంగా చూస్తే బంగారం ధరలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సగటున ఏటా 5-11% మధ్య వృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం పెరిగే సమయంలో గోల్డ్ చక్కని హెడ్జింగ్ సాధనం. పెట్టుబడుల వైవిధ్యం దృష్ట్యా బంగారం ఒక మంచి పెట్టుబడి సాధనం అవుతుంది. అయితే అది కడ్డీలు లేదా జ్యుయలరీ రూపంలో ఉండకూడదు'' అని బిల్లిమోరీ సూచించారు. పీపీఎఫ్, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలు బంగారం మాదిరే వైవిధ్యానికి తోడు, మెరుగైన రాబడి, లిక్విడిటీతో ఉంటాయని చెప్పారు. కనుక పాత బంగారం మార్పిడి అనేది అవసరం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఉపయోగించని ఆభరణాలను మార్చుకుని కొత్తవి తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. పెట్టుబడి కోసం అయితే ఆభరణాలకు బదులు నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం మేలు. దీని వల్ల బంగారం విలువలో నష్టపోయే అవకాశం ఉండదు. 2010 వరకు బంగారం విలువ 10 గ్రాములు రూ.15,000 స్థాయిలోనే ఉండేది. కనుక పెట్టుబడుల దృష్ట్యా భౌతిక బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారు. కానీ, నేడు ధర గణనీయంగా పెరిగిపోవడంతో, పెట్టుబడి కోణంలో డిజిటల్ బంగారం సాధనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.



మార్చుకుంటే ఎంత కోల్పోవచ్చు..?

	పాత ఆభరణం	కొత్త ఆభరణం
బరువు	20గ్రాములు	20 గ్రాములు
ధర (10 గ్రా.)	రూ.60,000 (సుమారు)	రూ.60,000
తరుగు-తయారీ చార్జీలు	లేవు	15 శాతం
పన్ను	వర్తించదు	3 శాతం
మొత్తం ధర	1,20,000	1,41,600

మార్చుకోవడం వల్ల కోల్పోయేది రూ.21,600

కొనుగోలు మార్గాలు.. చార్జీలు.. రిస్కులు

సాధనం	కొనుగోలు మార్గం	రిస్క్	చార్జీలు	కనీస పెట్టుబడి
భౌతిక బంగారం	ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలు	జాగ్రత్తగా కాపాడుకోవడం	లాకర్, తయారీ, ఇన్సూరెన్స్ వ్యయాలు	ఒక గ్రాము విలువ
డిజిటల్ గోల్డ్	యాప్స్ సాయంతో	నియంత్రణ, పర్యవేక్షణ లేదు	జీఎస్‌టీ పన్ను	రూపాయి నుంచి
గోల్డ్ ఈటీఎఫ్‌లు	షేర్ల మాదిరే, స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి	ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు	ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో, డీమ్యాట్ ఏఎంసీ చార్జీలు, బ్రోకరేజ్	ఒక గ్రాము నుంచి
గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్	ఏఎంసీల నుంచి, బ్రోకర్ల నుంచి	ఈటీఎఫ్‌ల మాదిరే	0.6-1.20 శాతం	రూ.100 నుంచి
ఎస్‌జీబీలు	ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు, బ్రోకర్ల సాయంతో	దాదాపుగా లేనట్టే	చార్జీల్లేవు, పైగా పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం రాబడి	రూ.5,000 నుంచి

కొటక్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 4,423 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఏడాది (2023-24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24% జంప్‌చేసి రూ. 4,423 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 2,581 కోట్ల నుంచి రూ. 3,191 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 21% వృద్ధితో రూ. 6,297 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 5.22 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,314 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.08% నుంచి రూ. 1.72%కి తగ్గాయి.



అశోక్ వాస్వానికి సై: కొటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈవోగా బయటి వ్యక్తి అశోక్ వాస్వాని ఎంపికకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ నాలుగు నెలల ముందుగానే ఎండీ, సీఈవో బాధ్యతల నుంచి వైదొలగుతున్న నేపథ్యంలో అశోక్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,896 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36% జంప్‌చేసి రూ. 10,896 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ.7,558 కోట్ల నుంచి రూ. 10,261 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 31,088 కోట్ల నుంచి రూ. 40,697 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 18,308 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.31 శాతం నుంచి 4.53 శాతానికి బలపడ్డాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,861 కోట్లయ్యింది.



ఎన్‌పీఏలు డౌన్...

తాజా సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి రూ. 2.48 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.07 శాతంగా నమోదైంది.

రామ్‌కో సిమెంట్స్	షేర్‌ఖాన్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 991 టార్గెట్: రూ. 1,130

స్టాక్స్ వ్యూ

ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరల వేగవంత పెరుగుదల, ఈ ఏడాది(2023-24) రెండో త్రైమాసికం (క్యూ2) తదుపరి ఇంధన వ్యయాలు తగ్గడం వంటి అంశాల కారణంగా లబ్ధి పొందే అవకాశముంది. దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరలు అక్టోబర్ 5 నుంచి ఒక్కో బ్యాగుకి సుమారు రూ. 40 చొప్పున ఎగశాయి. వెరసి క్యూ2(జులై-సెప్టెంబర్)తో పోలిస్తే సిమెంట్ ధరలు 10 శాతం అధికంగా లభించనున్నాయి. సీజనల్‌గా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2 బలహీన కాలం అయినప్పటికీ బలమైన డిమాండ్ కనిపించింది. ఈ ట్రెండ్ పూర్తి ఏడాదిలోనూ కొనసాగే అంచనాలున్నాయి. పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాల పరిమాణంలో 20 శాతం వార్షిక వృద్ధిని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నెలలో అంతర్జాతీయ కోల్, దేశీ పెట్ కోక్ ధరలు నెలవారీగా చూస్తే 13-5 శాతం చొప్పున క్షీణించాయి. మరోవైపు ప్రాంతాలవారీగా సిమెంట్ ధరలు బలపడటంతో నిర్వహణ లాభాలు మరింత పుంజుకునేందుకు వీలుంది. నాన్‌ట్రేడ్ విభాగంపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించడం, అధిక ధరల ఉత్పత్తులు(ప్రీమియమైజేషన్), వ్యయ నిర్వహణా సామర్థ్యాలు, సిమెంటు విక్రయాలలో గరిష్ట ధరలను పొందడం, కొనసాగుతున్న పటిష్ట డిమాండు వంటి అంశాలు కంపెనీ నిర్వహణ లాభం, నికర లాభాలను భారీగా మెరుగుపరిచే అవకాశముంది. దీంతో కంపెనీ ఆర్జనలు పుంజుకోనున్నాయి. ఇది కంపెనీ రీరేటింగ్‌కు దారితీయవచ్చని భావిస్తున్నాం.



పిల్లల ఉన్నత విద్యకు అనుకూల సాధనాలు?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?

– కిరణ్

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్‌లు మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్లలోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?

– విజయశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ఈక్విటీల్లోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు.

ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.

హిండాల్కో	మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 473 టార్గెట్: రూ. 570

ఎందుకంటే: అల్యూమినియం తయారీ దిగ్గజం హిండాల్కో ఇండస్ట్రీస్‌కు ఒడిషాలోని హీరాకుడ్, ఆదిత్య ప్లాంట్లను ఇటీవలే సందర్శించాం. తద్వారా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మెటల్ తయారీ విధానాలు, కార్యకలాపాలను పరిశీలించాం. ఆదిత్య స్మెల్టర్ ప్లాంటు ప్రపంచంలోనే చౌక వ్యయాల, అత్యంత సమర్థవంతమైన యూనిట్లలో ఒకటిగా నిలుస్తోంది. అత్యంత ఆటోమేటెడ్ విధానంలో ఏర్పాటైన ఈ యూనిట్ కార్యకలాపాల నియంత్రణలో అతిఎక్కువ టెక్నాలజీతోపాటు, క్రేన్లు తదితరాలను వినియోగిస్తోంది. డౌన్‌స్ట్రీమ్‌లో ముడిసరుకులకు సంబంధించి ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్స్(ఎఫ్ఆర్‌పీ) విస్తరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. తద్వారా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుంది. ఇది వ్యయాల ప్రభావిత(ఆదా) సమీకృత విధానంలో భాగంకాగా.. సొంత హాట్ మిల్ సామర్థ్యం ద్వారానే ఎఫ్ఆర్‌పీ ప్రొడక్టులను రూపొందించుకోగలుగుతోంది. అత్యున్నత ఆటోమేషన్, టెక్నాలజీ వినియోగంతోపాటు.. తయారీ విధానంలో ప్రతీ చోటా వ్యయాల ఆదాకు మరింతగా ప్రయత్నిస్తోంది. తయారీలో అత్యంత రక్షణాత్మక చర్యలను అనుసరిస్తోంది. సామర్థ్యాన్ని గరిష్టంగా వినియోగించుకునే బాటలో సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా విధానాలను అవలంబిస్తోంది. పటిష్ట బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే విస్తరణ సంబంధ పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటోంది. అత్యంత సమీకృత కార్యకలాపాలు కలిగిన కంపెనీ డౌన్‌స్ట్రీమ్ సామర్థ్య విస్తరణ ద్వారా లాభాలను భారీగా పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది.

